ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

స్నేహ

సెప్టెంబర్ 3, 2006

Entered

కథా నిలయం
శ్రీకాకుళం

తిండి కలిగితె కండ కలదోయ్ !

హ్యాపీ బర్త్‌డే

(3.9.2006 నుంచి 9.9.2006వరకు)

మమత
సెప్టెంబర్-3
[illegible]-[illegible]మయ్య
[illegible]-రంగారెడ్డి

కె. చందన
4సం॥, సెప్టెంబర్-4
శైలజ-సుబ్రమణ్యం
విరాట్‌నగర్-ప్రకాశం

సిహెచ్. బిందుశ్రీ
10సం॥, సెప్టెంబర్-4
భద్రమ్మ-రామనర్సయ్య
టేకులపల్లి-ఖమ్మం

జి. సూర్యతేజ
1సం॥, సెప్టెంబర్-4
నాగమల్లేశ్వరి-శ్రీనివాసరావు
దుగ్గిరాల-గుంటూరు

ఎ. ఉమేరియా
1సం॥, సెప్టెంబర్-4
మెహమూద-చాంద్‌పాషా
మానాజీపేట-మ॥నగర్

వై. మేఘన
3సం॥, సెప్టెంబర్-4
ఉష-మనోహర్‌బాబు
బనగానపల్లి-కర్నూలు

ఎం. స్వేత
10సం॥-1996
లలిత-శ్రీనివాసరావు
కవాడిగూడ-హైదరాబాద్

ఎం. పి. కోమల
1సం॥-2005
భారతి-పద్మారావు
వెంకటాపురం-సికింద్రాబాద్

ఎ. లెనిన్
4సం॥-2002
శోభ-రాజారామ్
ఫతేజాన్‌పేట-నెల్లూరు

యం. విహాస్(సుబ్బు)
3సం॥-2003
అపర్ణ-గంగాధర్
బండలింగపూర్-కరీంనగర్

జి.ప్రజ్వల్
మాసమ్మ-రత్నయ్య
వనపర్తి-మ॥నగర్

యం.డి. యాసీన్
అహ్మద్‌బేగం-యాదుల్ హుస్సేన్
హుస్సేన్‌నగర్-మెదక్

మంజులత
తిరుమల-తిరుపతి
సుందరగిరి-కరీంనగర్

కె. హర్షిత(స్నేహ)
రమాశ్రీ-శ్రీనివాస్‌గౌడ్
నేలపట్ల-నల్లగొండ

శివ గణేష్
శేషమ్మ-నాగన్న
కర్నూల్

ఆర్. ఖ్యాతి వర్ధన్
3సం॥, సెప్టెంబర్-8
రాజీ-శ్రీనివాసరావు
విజయవాడ

ఎన్. జాహ్నవి
8సం॥, సెప్టెంబర్-1998
శివకుమారి-వేణుగోపాల్
విద్యానగర్-కరీంనగర్

సిహెచ్. వంశీకృష్ణ
ప్రవంతి-మురళీకృష్ణ
వాసవీనగర్‌కాలనీ-చీరాల

మంజునత
తిరుమల-తిరుపతి
సుందరగిరి-కరీంనగర్

జి. సంకీర్తన
సెప్టెంబర్-2
మేఘమాల-చందు
మల్కాజ్‌గిరి-హైదరాబాద్

సిసలైన నాట్యాన్ని నేర్పాలి

మన అతిథి గురించి...

పేరు	:	వేదాంతం సత్యనారాయణశర్మ.
జన్మదినం	:	10.8.1934
జన్మస్థలం	:	కూచిపూడి, మొవ్వ మండలం, కృష్ణాజిల్లా
విద్య	:	సంస్కృతం, కూచిపూడి నృత్యం
వృత్తి	:	తానే నెలకొల్పిన వెంకటరామానాట్యమండలి సంస్థ ద్వారా 40 సంవత్సరాలుగా దేశ, విదేశాల్లో ప్రదర్శనలు ఇచ్చి కూచిపూడి నృత్యానికి అఖండ గౌరవం తేవడం.
ప్రవృత్తి	:	సంగీతం
లక్ష్యం	:	కూచిపూడి నాట్యంలో పురుష సంప్రదాయం నిలబెట్టి, శిక్షణ ఇచ్చి దేశవ్యాపితంగా ప్రచారం నిర్వహించాలని. బిరుదులు, అవార్డులు : 1961లో కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు, 1968లో కేంద్ర సంగీత నాటక అకాడమీ ఫెలో, 1970లో రాష్ట్రపతిచే పద్మశ్రీ అవార్డు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే 'భారత కళాప్రపూర్ణ', 'హంస' అవార్డులు.
గురువులు	:	వేదాంతం రాఘవయ్య, వెంపటి పెదసత్యం, చినసత్యం, పసుమర్తి కృష్ణమూర్తి.

నేడు కూచిపూడి నాట్యం సరైనస్థితిలో అభినయించడం లేదు. కథాకళి, మణిపురి, ఒడిస్సీ, భరతనాట్యం బాణీలను కూచిపూడి నాట్యంలో మిక్స్‌చేసి పిల్లలకు నేర్పడం, వారితో అభినయింపజేయడం జరుగుతున్నది. అచ్చమైన తెలుగు పదాలలో ఆంగ్లభాషను చేర్చి మాట్లాడితే ఎలా ఉంటుందో ఇదీ అంతే. అచ్చమైన తెలుగుభాష మాదిరిగా అసలైన, సిసలైన కూచిపూడి నాట్యాన్ని అలాగే నేర్పాలి, ప్రదర్శించాలి.

ఈ సంచికలో...

టపా	...	2
టర్నింగ్ పాయింట్	...	4
సలహాలు	...	5
ఇంటి సంగతులు	...	6
క్యాంపస్ ఛాట్	...	10
సినిమా కబుర్లు	...	11
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
సెన్సూ కామన్ సెన్సు	...	20

ఇంకా...

ఇలా వుందామా... 7

ఆకలి

సీరియల్ 8

తెలుగుగడ్డ

కథ 18

భవనం

అవీ... ఇవీ...	...	21
మనసా... తెలుసా	...	22
విజ్ఞాన వీచిక	...	23
కొత్త పుస్తకాలు	...	24

ఫోరెన్సిక్‌సైన్స్

20-08-06న ప్రచురించిన అట్టమీది కథ 'ఫోరెన్సిక్‌సైన్స్ తిరుగులేనిసాక్ష్యం' ఆసక్తికరంగా ఉంది. సైన్సు సాధించిన అద్భుత విజయాలకు 'ఫోరెన్సిక్ సైన్స్' ఒక మచ్చుతునక. డిఎన్ఎ, ఫింగర్‌ప్రింట్స్ వంటి వాటితో పాటు జాగిలాల సేవ ఎంతో తోడ్పడుతుంది. నిజాన్ని నిగ్గుతేలుస్తుంది. సత్యాన్ని బతికిస్తుంది. 'విజ్ఞాన వీచిక' శీర్షికద్వారా గొరిల్లాల పూర్తి జీవన చిత్రం మాకు సదవగాహన కలిగించింది. తెలియని విశేషాలెన్నింటినో మా ముందుంచింది. హరిగారి కార్టూన్లు భలే పేలాయి. నవ్వులపువ్వులను రువ్విస్తూ అలరింపజేశాయి. మెగాస్టార్ మొదటి చిత్రం 'ప్రాణం ఖరీదు'ద్వారా కోట శ్రీనివాసరావు పరిచయమయ్యారని 'సినిమా కబుర్లు' ద్వారా తెలుసుకున్నాం. 'టర్నింగ్‌పాయింట్', 'ఇంటిసంగతులు', 'ఇలా ఉందామా' బాగా నచ్చాయి. ధన్యవాదాలతో...

నేమాన సుభాష్ చంద్రబోస్. ఇలిసిపురం జంక్షన్, శ్రీకాకుళం



చక్కని వ్యాసం

ఫాసిస్టు హిట్లర్ అత్యంత పాశవికంగా మరణించడం యాదృచ్ఛికమే. కోట శ్రీనివాసరావు గురించిన కబుర్లు ఆసక్తికరంగా వున్నాయి. 'ఫోరెన్సిక్ సైన్స్' అంటూ చక్కని వ్యాసం అందించారు. ఆధునిక పరిజ్ఞానం నేరాలు రూపుమాపేదానికన్నా, నేరాలను తగ్గించడానికి పనికివస్తే ఎంతోమంది సంతోషిస్తారు. ఎవరైతే నాకేం భయం అంటూ 'అవీ ఇవీ'లో ప్రచురించిన చిన్న బాబు చిత్రం చక్కగా ఉంది. ఉమ్మడి జీవసంపద గొరిల్లాను మానవులు కాపాడుకోవాలనడం విజ్ఞత.

వాస్తు రామచంద్ర, రాంజీనగర్, నెల్లూరు

అట్టమీది కథ

ఈ వారం 'అట్టమీదికథ' బాగుంది. చాలా విషయాలు తెలుసుకున్నాం. నేరపరిశోధనలో ఫోరెన్సిక్ సైన్సు పాత్ర ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. అలాగే నాజీ నియంత హిట్లర్ చివరిరోజు గురించి వివరించిన టర్నింగ్ పాయింట్ బాగుంది. ప్రజల అభిప్రాయాలను పెడచెవిన పెట్టి, నియంతృత్వాన్ని ప్రదర్శించే నాయకులకు పతనం తప్పదని హిట్లర్ జీవితం మనకు తెలియజేస్తుంది. క్యాంపస్ ఛాట్, ఇంటిసంగతులు, ఇలా ఉందామా... శీర్షికలు బాగున్నాయి.

కె. శ్రీనివాసరావు, కె. రమాదేవి. కామేపల్లి, ఖమ్మం జిల్లా

బద్ధకిస్టు

'ఇలా ఉందామా' శీర్షికలో బద్ధకిస్టుల గురించి చక్కగా వివరించారు. చాలా పనులు రేపు చేద్దాంలే అంటూ పోస్టుపోను చేయడం చాలామందికి అలవాటే. దీన్నెలా పోగొట్టుకోవాలో వివరిస్తే బాగుండేది. 'తెలుగు గడ్డ' సీరియల్ చాలా బాగుంటోంది.

సిహెచ్. శ్రీ హరి, నల్గొండ.

శ్రద్ధ

'స్నేహ' మమ్మల్ని బాగా ఆకట్టుకుంటోంది. 'ఇంటి సంగతులు'లో 'ఆసక్తి-ప్రోత్సాహం' బాగుంది. పిల్లలపట్ల ఎలాంటి శ్రద్ధ తీసుకోవాలి, ఏం చేస్తే వారిలో ఆసక్తి కలుగుతుంది అనే అంశాలు చక్కగా వివరించారు. స్నేహితులందరమూ కలిసి 'క్యాంపస్‌ఛాట్' చదువుతున్నాం. జోక్స్ మమ్మల్ని ఎంతగానో అలరిస్తున్నాయి.

జె. శ్రావణి, కొత్తగూడెం

బాగుంది

'ఇంటిసంగతులు'లో ఆసక్తి - ప్రోత్సాహం ఆసక్తికరంగా సాగింది. పిల్లలను ప్రోత్సహించాలి. అప్పుడే వారిలో ఆసక్తి మొలకెత్తుతుంది. ఇది తల్లిదండ్రులందరూ గమనించాల్సిన విషయం. దీన్నెంతో చక్కగా అందరికీ తెలియజేశారు. క్యాంపస్ ఛాట్ బాగుంది.

వి. వినోద్, సైఫాబాద్

నాజీ నియంత

'టర్నింగ్ పాయింట్' శీర్షికలో 'నాజీ నియంత చివరిరోజు' ఆసాంతం ఆసక్తిగా చదివించింది. యూదుల నిర్మూలన పేరిట హిట్లర్ సాగించిన నరమేధం ప్రపంచంలోని అన్ని దేశాలనూ బీభత్సానికి గురిచేసిందన్నది వాస్తవం. 'సలహాలు' శీర్షిక ఉపయోగకరంగా ఉంటోంది. కార్టూన్లు నవ్విస్తున్నాయి. ఇంటిసంగతులు శీర్షికలో 'ఆసక్తి - ప్రోత్సాహం' బాగుంది.

అరుణ, విద్యానగర్, హైదరాబాద్

లోకం తీరు

'లోకం తీరు' కథ నేటి జీవన విధానానికి అద్దం పట్టింది. చాలామంది కట్నం తక్కువైందనీ, జాతకాలు కలవలేదనీ, అమ్మాయి హీరోయిన్లా లేదనీ వంకలు పెడుతుంటారు. వారు మేలుకునేసరికి పుణ్యకాలం కాస్తా గడిచిపోతుంది. ఈ విషయాన్నే చాలా చక్కగా ఈ కథలో వివరించారు. 'అవీ... ఇవీ' పేజీలో చిన్నారి బొమ్మ చాలా బాగుంది.

జి.రమేష్, వనస్థలీపురం

రూ.510/- ల ఇంగ్లీష్ కోర్సు రూ.150/- కే

లేటెస్ట్ టెక్నాలజీ సహాయంతో



మొత్తం మూడు డివిజన్ల ప్రత్యేక ఇంగ్లీష్ కోర్స్

డివిజన్-1	డివిజన్-2	డివిజన్-3	రూ.
రూ.130/-	రూ.170/-	రూ.210/-	510/-

రూ. 150/-కే

ఇవన్నీ!

డివిజన్-1 ABCD ల నుంచి ఇంగ్లీష్ చదవటం, రాయటం, నేర్పుతూ, ప్రతి ఒక్కరికీ కావలసిన స్థాయిలో స్టాండర్డ్ ఇంగ్లీష్ నేర్పబడుతుంది. ఈ కోర్స్ ఫీజు రూ.130/-

డివిజన్-2 తప్పులు లేకుండా ఇంగ్లీషు రాయుటకు కావలసిన ఆంగ్ల వ్యాకరణం పరిపూర్ణంగా సులభ సూత్రాలతో చాలా ఈజీగా నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.170/-

డివిజన్-3 ఎంతో సులభంగా, ఏ సందర్భంలోనైనా తడబడకుండా, తప్పులు లేకుండా, మంచి నీళ్ళు త్రాగుతున్నట్లుగా మంచి ఇంగ్లీషు మాట్లాడటం నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.210/-

ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!...

నేను ఒకసారి రైలులో ప్రయాణిస్తున్నాను. నా ప్రక్క సీటులోని వ్యక్తి స్టూడెంట్స్ ఇంగ్లీష్ ఇన్‌స్టిట్యూట్ వారి పుస్తకాలు చదువుతున్నాడు. నేనూ టైంపాస్ కొరకు ఒక బుక్ తీసుకొని చదివాను. అంతే! నాకు ఆశ్చర్యంవేసింది. "ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!..." అనిపించింది. నేనూ పుస్తకాలు తెప్పించుకుని చదివి ప్రస్తుతం నేను చక్కగా ఇంగ్లీష్‌లో మాట్లాడుతున్నాను.

- కె.కమలాకరరావు, విజయవాడ.

ఇదొక డిఫరెంట్ కోర్స్!

డిగ్రీవరకు చదివిన నేను ఇంగ్లీష్‌లో మాట్లాడలేకపోయేవాడిని, నా మిత్రుని వద్ద ఈకోర్స్ బుక్స్ చూశాను. ఇంగ్లీష్ ఫ్లూయెన్సీకి కరక్ట్‌గా ఉపయోగపడే బుక్స్ యివి. 'ఇదొక డిఫరెంట్ కోర్స్' అని నాకు అనిపించింది.

- వి.కె. రాజు, రాజమండ్రి.

కోర్స్ అద్భుతంగా ఉంది!

అవును! ఈ ఇంగ్లీష్ కోర్స్ చాలా అద్భుతంగావుంది. ఎందుకంటే, బాగా చదివినవారికే కాక, కొద్దిగా చదువుకున్న వారికి కూడా అర్థమయ్యేరీతిలో చెప్పిన విధానం చాలా బాగుంది.

- కె.సురేష్, హైదరాబాద్.

ఎక్కడా చూడలేదు

నేను డిగ్రీ వరకూ చదివాను. అయినా ఇంగ్లీష్ మాట్లాడలేక పోయేవాడిని. సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోండి అని ప్రకటన చూసి కోర్స్ కొన్నాను. నిజానికి నేను ఇలాంటి కోర్స్ బుక్స్ ఎక్కడా చూడలేదు.

- వై.చంద్రశేఖర్, విశాఖపట్నం.

సులభంగా వుంది

చాలా పుస్తకాలు చూశాను. ఇంగ్లీష్ నేర్పే విధానం ఆ పుస్తకాల్లో అర్థమయ్యేది కాదు నాకు, ఈ కోర్స్ కొని చదువుతుంటే, ఇంగ్లీష్ ఇంత సులభమా అనిపించేంతగా వుంది. చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకొన్నాను.

- జె.శ్రీనివాసులు, తిరుపతి.

STUDENTS' ENGLISH INSTITUTE

POST BAG NO.8569, New No. 203, Habibullah Road,
(Near: KodambakkamRly. Stn;) T.Nagar, Chennai - 17.

నాకు ప్రస్తుతం రూ.510/-లు విలువగలిగిన ఇంగ్లీష్ కోర్సు కేవలం రూ.150/- లకే వి.పి.పి. ద్వారా పంపించండి. పోస్ట్‌మేన్‌కి పైకం చెల్లించి ప్యాకెట్‌ని తీసుకుంటానని హామీ ఇస్తున్నాను.

3840

Name: ....

Address: ....

....

....

....

.... Pincode

టర్నింగ్ పాయింట్

శ్రీ కృష్ణ వరప్రసాద్

ఆర్.కె. లక్ష్మణ్ కాపీ కొట్టాడా?!



"నువ్వింకా కుర్రాడివి. ఇలా తిన్నగా రాజధానికి వచ్చేసి ఉద్యోగం చేస్తాననకూడదు. ముందుగా మీ దగ్గరలోని పట్టణాల్లో పని చేయాలి" అన్నాడు.

'పక్షుల్లో కాకి తెలివితేటలు, అవి అటూఇటూ కదిలేతీరు నాకెంతో ఇష్టం. రామచిలుకలా అదేమీ మందమతి కాదు. కాకి దురదృష్టమేమిటంటే, మనం దాన్ని అలుసుగా చూస్తాం. ఓ వాక్యంలో ఫుల్‌స్టాప్‌ని ఎలా చూస్తామో అలా' – ఈ మాటలన్నది సుప్రసిద్ధ కార్టూనిస్ట్ ఆర్.కె. లక్ష్మణ్. కాకుల్ని గమనించటం ఆయనకో అలవాటు. అంతే కాదు వాటి బొమ్మలు వేస్తుంటారు కూడా.

పుట్టగానే పరిమళించే పువ్వులా ఆర్.కె.లక్ష్మణ్ మూడేళ్ళప్పుడే బొమ్మలు వేసేవాడు. అప్పట్లో లక్ష్మణ్ బొమ్మలకి ఉపయోగించింది కాగితం, బ్రష్, రంగులూ కాదు. చాక్‌పీస్ ఒకటి దొరకబుచ్చుకుని ఇంట్లో గచ్చుమీద పిల్లి, ఎలుక, బకెట్ లాంటివి వేసేవాడు.

గత 58 ఏళ్లుగా, ఆంగ్లదినపత్రిక 'టైమ్స్ ఆఫ్ ఇండియా'లో పొలిటికల్ కార్టూనిస్ట్‌గా చేస్తున్న ఆర్.కె. లక్ష్మణ్ అసలక్కడ ఉద్యోగంలో చేరటం అనుకోకుండా జరిగింది.

లక్ష్మణ్ చదువు పూర్తవకుండానే పత్రికల్లో కథలను బొమ్మలుగా వేయటం మొదలుపెట్టాడు. వేసవి సెలవుల్లో మద్రాసులోని జెమినీ స్టూడియోస్‌లో కొన్నాళ్లు పని చేశాడు కూడా. పట్టభద్రుడైన వెంటనే లక్ష్మణ్ తన వస్తువులన్నీ ఓ పెద్ద పెట్టెలో సర్దుకొని, స్వస్థలం మైసూరు నుంచి ఢిల్లీ చేరుకున్నాడు. కార్టూనిస్ట్‌గా ఉద్యోగం చూసుకోవాలనే బయలుదేరాడు. హిందూస్థాన్ టైమ్స్ దుర్గాదాస్‌ని కల్సి తన బొమ్మలు చూపిస్తే, ఆయనకు నచ్చాయి. కానీ ఓ వారంపాటు రోజుకో కార్టూన్ గీసి చూపమన్నాడు.

అలా రోజూ లక్ష్మణ్ వేసిన కార్టూన్ చూసి 'చాలా బాగుంది' అని మెచ్చుకొనే వారు దుర్గాదాస్. వారం తర్వాత ప్రొప్రయిటర్ దేవదాస్ గాంధీని కలవమన్నాడాయన.

దేవదాస్ గాంధీకి కూడా లక్ష్మణ్ బొమ్మలు నచ్చాయి. బీహార్‌లో తమ పేపర్ 'టార్చిలైట్'లో పని చేయాల్సి ఉంటుందని చెప్పాడు. అప్పటికి భారతదేశంలో ఏ ప్రాంతం ఎక్కడుందో కూడా సరిగ్గా తెలియని లక్ష్మణ్, అక్కడికి వెళ్ళలేనని చెప్పాడు. 'అయితే నీ కార్టూన్లను మా దగ్గర పనిచేస్తోన్న అహ్మద్‌కి చూపించాం. అతనేమంటాడో చూద్దాం' అన్నాడు గాంధీ.

ఆ కార్టూన్లను చూసిన అహ్మద్ "నువ్వింకా కుర్రాడివి. ఇలా తిన్నగా రాజధానికి వచ్చేసి ఉద్యోగం చేస్తాననకూడదు. ముందుగా మీ దగ్గరలోని పట్టణాల్లో పని చేయాలి" అన్నాడు.

దాంతో లక్ష్మణ్ మద్రాస్ తిరిగొచ్చేయాలనుకున్నాడు. ఆ ప్రయాణంలో బొంబాయిలో ఆగాడు. లక్ష్మణ్ స్నేహితుల్లో ఒకరు 'ఫ్రీ ప్రెస్ జర్నల్ ఎడిటర్ నటరాజన్‌ని కలవరాదూ?' అని సూచించారు.

"నేను ఆయన్ని కలవటానికి వెళ్ళినప్పుడు పెద్ద సిగార్ కాలుస్తున్నారు. నా కార్టూన్లు చూసి నవ్వి 'బాగున్నాయ్, ఉద్యోగం కావాలా?' అనడిగారు. 'అవును సర్' అని నేను చెబితే, "వెళ్ళక్కడ కూర్చో" అని ఓ టేబిల్ చూపించారు. అక్కడ, పక్కనే కూర్చున్న ఓ వ్యక్తి సీరియస్‌గా పంజరంలో ఉన్న పక్షి బొమ్మ వేస్తున్నాడు. అతనెవరో కాదు.. బాల్‌థాకరే" – అంటూ నాటి సంఘటన వివరించారు ఆర్.కె. లక్ష్మణ్.

అక్కడ మరో కార్టూనిస్ట్ భట్ కూడా ఉన్నాడు. సోమవారం లక్ష్మణ్, మంగళవారం థాకరే, బుధవారం భట్ – ఇలా రోజుకొకరు వంతుల వారీగా కార్టూన్లు వేసేవారు. ఆరు నెలల తర్వాత ప్రొప్రయిటర్ సదానంద్‌తో అభిప్రాయ భేదాలొచ్చి అక్కడ మానేశాడు లక్ష్మణ్.

తర్వాత 'టైమ్స్ ఆఫ్ ఇండియా' ఆఫీసుకి వెళ్ళాడు ఆర్. కె. లక్ష్మణ్. అదే ఆయన జీవితంలో టర్నింగ్ పాయింట్. అక్కడ వాల్టర్ లేంఘామర్‌ని కలిస్తే "నేను నీ బొమ్మలు చూస్తూనే వున్నాను. డేవిడ్‌లో బొమ్మల్ని కాపీ కొడుతున్నట్టుందే?' అన్నాడాయన.

లక్ష్మణ్ రోషంగా "నేను ఎవరినీ కాపీ కొట్టను. బొమ్మలు నేను సొంతంగా నేర్చుకున్నాను. వాస్తవానికి నేను జీవితంలో ఏదీ కాపీ కొట్టలేదు" అనేసరికి "సరే సరే, ఊరికే పరీక్షించటానికి అన్నాను. అక్కడ కూర్చొని నాకో బొమ్మ వేసివ్వు. ఓ టేబిల్ దగ్గర కూర్చొని చదువుతూ, ఆడుకుంటున్న మనిషి బొమ్మ వేయాలి.. అదీ అరగంటలో" అన్నాడు వాల్టర్.

కానీ లక్ష్మణ్ కొన్ని నిమిషాల్లోనే బొమ్మ వేసేశాడు.

"చాలా బాగుంది. అని మెచ్చుకుని, ఇంతకుముందు నీకెంత జీతం వచ్చేది?" అనడిగాడాయన.

"250 రూపాయలు. ఇక్కడ 300 ఇస్తే చాలా సంతోషిస్తా" అని చెప్పాడు లక్ష్మణ్.

"డియ్యేతోనా డియ్యే కాకుండానా?" అని మళ్లీ ప్రశ్నిస్తే, లక్ష్మణ్ తికమకపడ్డాడు. అప్పట్లో అతనికి డియ్యే (డియర్నెస్ ఎలవెన్స్) అంటే ఏమిటో తెలీదు.

కాసేపటికి 500 రూపాయల జీతం యివ్వబోతున్నట్టు లక్ష్మణ్‌కి తెలపగా "ఒకసారి మద్రాస్ వెళ్లి మా అమ్మను చూసి వచ్చాక ఉద్యోగంలో చేరతాను" అన్నాడు లక్ష్మణ్ సంతోషంగా. ✦

పదేపదే స్టేషనుకు తీసుకెళుతున్నారు...

మా అన్నయ్యను పోలీసులు అరెస్టుచేశారు. ఏ కేసూ పెట్టకుండానే వదిలేశారు. కొన్నాళ్ల తర్వాత పోలీసులు మళ్లీ తనని తీసుకెళ్లారు. రెండురోజులు కస్టడీలో ఉంచుకున్నారు. మళ్లీ వదిలేశారు. మేం నివసిస్తున్న గ్రామంలో మాకు కొందరు ప్రత్యర్థులున్నారు. వారే పోలీసువారి ద్వారా మాకు ఈ పరిస్థితి కల్పిస్తున్నారనిపిస్తోంది. అందుకే పోలీసులు మా అన్నయ్యను పట్టుకుపోయి, ఏదైనా కేసు బనాయించాలని అనుకుంటున్నారేమో. ఇంతవరకూ అలాంటిదేమీ జరగలేదు. కేవలం పట్టుకుని వెళ్లి, కొన్ని రోజులు స్టేషన్‌లో ఉంచుకుని, వదిలేస్తున్నారు. ఇలా పదేపదే మా అన్నయ్యను స్టేషనుకు పట్టుకెళ్లడం వల్ల మా పరువుపోతోంది. మే మేం చేయాలి.

రాంబాబు, తుని

అరెస్టు చేసిన వారిని 24గంటల లోపు ఏదైనా మెజిస్ట్రేట్ ముందు ఉంచాలి. కానీ మీరు చెబుతున్నదాన్ని బట్టి పోలీసులు ఆ విధంగా చేయలేదని తెలుస్తోంది. పోలీసులు అక్రమంగా ఎవరినైనా తీసుకెళ్లి తమ అధీనంలో ఉంచుకుంటే హైకోర్టులో (హెబియస్ కార్పస్) రిట్‌పిటిషన్ వేసి కోర్టు ముందు ప్రవేశపెట్టేటట్లు చేయవచ్చు. లేదా మీ దగ్గరి కోర్టులో రిట్‌పిటిషన్ వేసి తనని మెజిస్ట్రేటు ముందు ప్రవేశపెట్టించవచ్చు. కేసు ఏదైనా ఉంటేనే పోలీసు వారు ఎవరినైనా తమ అధీనంలోకి తీసుకోవాలి. అలా ఎటువంటి కేసూ లేని పక్షంలో అది నేరమౌతుంది.

డబ్బుతీసుకున్నాడు... కేసు దాఖలు చేయలేదు

మాకు తెలిసిన వారికి ఆపద సమయంలో పదివేల రూపాయలు అప్పుగా ఇచ్చాం. ప్రొనోటుంది. అతను డబ్బు ఎంతకీ తిరిగి చెల్లించట్లేదు. అడిగిన ప్రతిసారీ వాయిదా వేస్తూ వచ్చాడు.

ఎంతకీ ఇవ్వకపోవడంతో మేం లాయరుగారిని సంప్రదించాం. మా దగ్గర అప్పు తీసుకున్న వ్యక్తికి నోటీసు ఇవ్వడంకోసం, అతనిపై కేసు దాఖలు చేయడంకోసం కొంత మొత్తాన్ని ప్లీడరుగారికి అందించాం. అతను కేసు దాఖలు చేయలేదు. మేం అడిగితే ఇవాళ రేపు అని దాటవేస్తున్నాడు. అలాగే మూడు సంవత్సరాలు గడిచిపోయాయి. మేం ఇప్పుడేం చేయాలి. లాయరు గారి మీద చర్యతీసుకోలేమా? మా డబ్బులు పోయినట్లేనా, కనీసం ప్లీడరు కిచ్చిన ఫీజుకూడా వెనక్కివ్వడం లేదు.

రమేష్, విజయవాడ

ప్లీడరు గారు మీ దగ్గర ఫీజు తీసుకోకముందే కేసు వేసి ఉండాలి. మీరు అతనికి ఫీజు ఇచ్చారని, కేసు దాఖలు కాకపోవడానికి కారణం అతని అశ్రద్ధ అని మీరు ఋజువు చేయగలరా? అలా చేయగలిగితే అతనిపై మీరు వినియోగదారుల ఫోరంలో కేసువేయవచ్చు. నష్టపరిహారం అడగవచ్చు.

జి.ఎల్.నరసింహారావు
హైకోర్టు న్యాయవాది

పాఠకులకు మనవి

మీకు లేదా మీవాళ్ళకు న్యాయ సంబంధమైన ఇబ్బందులేమైనా తలెత్తాయా? ఏం చేయాలో పాలుపోక సతమతమవుతున్నారా? అయితే వెంటనే ఆ సమస్యేంటో మాకు తెలియజేయండి. న్యాయవాది శ్రీ జి.ఎల్.నరసింహారావు తగిన పరిష్కారాన్ని తెలియజేస్తారు.

మా చిరునామా: ప్రజాశక్తి, ఆదివారం అనుబంధం, ఫ్లోట్ నెంబర్: 1, అశోక్ నగర్, హైదరాబాద్ - 500 020.

ఇంటి సంగతులు

ఇంద్రగంటి జానకీబాల

గ్లోబలైజేషన్

తెల్లారిలేస్తూనే కొడుకు ప్రసాద్ హడావుడిగా తయారై వెళ్ళిపోతూ, "అమ్మా! ఈ ఆథరైజేషన్ లెటర్ ఇస్తున్నా.. బ్యాంకుకెళ్లి నా స్టేట్‌మెంట్ తెచ్చిపెట్టు. నా కస్సలు టైం లేదు, ఓకే" అంటూ టిఫిను తినకుండా ఎనిమిది గంటలకన్నా ముందే బయటికెళ్లిపోయాడు.

అతను చెప్పిన మాటలు అర్థంచేసుకుని, సరే ననుకునేసరికి అయిదునిముషాలు పట్టింది లీలావతికి. ఆమె కాస్త చదువుకుంది. బయటి వ్యవహారాలు చక్కదిద్దగలదు. దాంతో వాళ్లందరికీ ఎంతో ఆసరాగా ఉంటుంది. లీలావతికి సెల్ఫ్ చెక్కులు, పోస్టాఫీసు అకౌంట్లు, ఎమ్ఐఎస్‌లు చలానాలు కట్టడం, డిడిలు తీసుకోవడం బాగా అలవాటే.

భర్త ఉద్యోగం చేసినంత కాలం ఈ పనులన్నీ ఆమెకే అప్పగించేవాడు. ఇప్పుడు రిటైరయ్యాక అతనే చేసుకుంటున్నా, కొడుకూకోడలూ, కూతురూ ఈ పనులన్నింటికీ లీలావతినే రిక్వెస్టు చేస్తుంటారు. అయినా ఈమధ్య కాలంలో బ్యాంకు పనిమీద వెళ్లక సుమారు ఏడాది కావస్తోంది అనుకుంటూ లీలావతి బ్యాంకుకెళ్లేందుకు సిద్ధమవసాగింది.

ఈమధ్య బ్యాంకులన్నీ ఆన్‌లైన్ చేశారని తెగచెప్పుకున్నారు. అంటే ఒక బ్యాంకులో అకౌంట్ ఉంటే అదే బ్యాంకుకు సంబంధించిన ఏ బ్రాంచీలోనైనా డబ్బు తీసుకోవచ్చు, వేసుకోవచ్చు. అదీకాక ఎప్పుడూ సిద్ధంగా వుండే ఏటిఎమ్‌లు. అందువల్ల ఒకప్పుడు పడిన ఇబ్బందులు ఇప్పుడు లేవని అందరూ ఆనందపడిపోతున్న రోజులివి.

లీలావతి బ్యాంకులో అడుగుపెట్టేసరికి అంతా కొత్తగా కనిపించింది. ఎక్కడుండాల్సిన వాళ్లు అక్కడలేరు. ప్రతిఒక్కరి ముందూ ఒక కంప్యూటర్. వాళ్లందరి కళ్లూ వి.వి. స్క్రీన్లకు అంటుకుపోయినట్లున్నాయి. లీలావతి లాగానే ఇంకా కొందరు ఈ కొత్తదనం చూసి ఆశ్చర్యపోయారు. "ఇవన్నీ మార్చేశారే... సీట్లు కూడా వేరే పద్ధతిలో పెట్టారు" అన్నారెవరో.

"పూర్తిగా కంప్యూటరైజ్ ఎలాగూ చేస్తున్నాం కదాని పూర్వం ఉన్న అవకతవకలు దిద్ది, పూర్తి వాస్తు ప్రకారం కట్టారు. ఇలా చేసిన తర్వాత బ్యాంకు బిజినెస్ ఈ బ్రాంచీలో బాగా పెరిగిందట" అంటూ మరొకరు వివరిస్తున్నారు.

లీలావతి ఒకరిద్దర్ని అడిగి ఒక అకౌంటెంట్ గారి దగ్గరికెళ్లి ఆథరైజేషన్ కాగితం ఇచ్చి "మా అబ్బాయి అకౌంట్ తాలూకు స్టేట్‌మెంటు కావాలండి" అంది.

ఆయన ఒక తృటికాలం కంప్యూటర్ మీంచి దృష్టి మళ్లించి ఒక చలాన్ తీసి "ఏభై అయిదు రూపాయలు కౌంటర్‌లో కట్టిరండి ఇస్తాను" అన్నాడు.

"డబ్బు కట్టాలా?" అంది.

"అవునండీ... అదేకదా చెబుతున్నా" అంటూ ఆకుపచ్చ కాగితం చేతిలో పెట్టాడు. లీలావతి పర్సులోంచి వందనోటు తీసి, క్యాష్ కౌంటర్ దగ్గర నిలబడితే పక్కకౌంటర్ వైపు చూపించాడా కటకటాల వెనుక మనిషి. ప్రతికౌంటర్ మీదా 'సింగిల్ విండో' అని ఉందిగానీ... ఆ పక్కకు ఆ పక్కకు అంటూ మూడు కౌంటర్లు తిప్పించుకుని ఇరవైమంది ఉన్న క్యూలో నిలబడింది. అరగంట తర్వాత 'హమ్మయ్య' అనుకునేంతలో...

"అయిదు రూపాయలుంటే ఇవ్వండమ్మా" అంది అవతలున్న మహిళ కంఠం.

ఇంక లీలావతి అవస్థ చూడాలి. పర్సు వెదికితే నాలుగు రూపాయలు దొరికాయి. బ్యాంకావిడ లీలావతి పేపరు పక్కన పెట్టింది. వెనుకనుంచి "మేడం, మీరు తప్పుకోండి" అంటున్నారు.

క్యూలో ఉన్న ఒకరిద్దర్ని రూపాయదగ్గా జేబులో చూసే ప్రయత్నం కూడా చేయకుండా తమవద్ద లేవంటూ చాలా మర్యాదగా సమాధానమిచ్చారు. ఎక్కడా ఒక్కరూపాయి దొరికే అవకాశం కనిపించలేదు. దూరంగా నిలబడిన ఒకాయన లీలావతి దగ్గరికొచ్చి "ఇదిగోనమ్మా" అంటూ రెండు అయిదు రూపాయిల బిళ్లలు ఇచ్చి పదినోటు తీసుకున్నాడు. లీలావతికి ప్రాణం తిరిగొచ్చింది. మళ్లీ క్యూలో దూసుకెళ్లి అయిదు బిళ్లలివ్వంగానే ఆమె మళ్లీ ఆకుపచ్చకాగితం చేతిలోపెట్టి "అకౌంట్ నెంబరు వేయండి" అంది.

బ్యాగ్‌లోంచి పెన్నుతీసి కొల్లేటి చాంతాడంత అకౌంటు నెంబరు చూసి, చూసి వేసేసరికి అయిదు నిమిషాలు పట్టింది.

సరే అయిందనిపించి ఆమె "కట్టానని చెప్పండి" అంది.

భయంగా అకౌంటెంట్ దగ్గరికెళ్లి "కట్టానండి" అంది లీలావతి.

ఆయన చకచకా కంప్యూటర్ ఆపరేట్ చేసి, ప్రింటౌట్ కోసం చూస్తున్నంతలో ఎవరో వచ్చి "ఏంటయ్యా నాపని చేసిపెట్టి పుణ్యం కట్టుకోవయ్యా ఖాళీగా ఉన్నట్టున్నావ్" అన్నాడు.

"మరే పన్లేక ఈగలు తోలుతున్నా... చాల్లే వెళ్లవయ్యా" అని ఆ వ్యక్తిమీద విరుచుకుపడి, సర్రున ప్రింటర్ లోంచి స్టేట్‌మెంటు కాగితాలు తీసి, లీలావతి చేతిలో పెట్టాడు.

"బతుకు జీవుడా" అని బయట పడుతుంటే పదిరూపాయలు చిల్లరిచ్చిన పెద్దాయన నవ్వుతూ "అంతా గ్లోబలైజేషన్" అన్నాడు.

లీలావతికి ఆ మాట పూర్తిగా అర్థంకాలేదు గానీ, బ్యాంకుల్లోనే కాదు చాలా చోట్ల వినిపించే ఈ మాట గురించి వివరంగా తెలుసుకోవాలని అనుకుంటూ బయటపడింది. ✦

ఇలా వుందామా...

వి. నాగరత్న

ఆకలి

చాలాకాలం క్రితం నేనో కథ చదివాను. అందులో ఓ ముసలమ్మ డాక్టర్ దగ్గరికి వెళ్తుంది. 'ఏమిటమ్మా, సమస్య?' అని డాక్టరడగ్గా ''ఆకలి పోవడానికి మందేమైనా వుంటే ఇవ్వయ్యా'' అంటుందామె. డాక్టర్ విస్తుపోయి చూసి, తనేమైనా పొరపాటుగా విన్నానేమోననే సందేహంతో "ఏంటీ?" అని రెట్టించగా "పొద్దున లేచిందగ్గర్నుంచీ ఒకటే ఆకలేస్తోంది. ఏ పని చేయడానికీ ఓపికలేని ఈ వయసులో నేనేం సంపాదించగలను? నా పిల్లలు నాకు తిండి పెట్టలేకపోతున్నారు. కానీ ఈ ఆకలేమో నన్ను నిలవనీయడంలేదు. దయచేసి ఆకలేయకుండా మందివ్వయ్యా" అని వాపోతుంది. 'బొత్తిగా తిండి సహించడంలేదు, ఆకలేయడానికేదైనా మందు రాసివ్వండ'ని అడగడమే తెలిసిన డాక్టర్ కళ్ళు తేలేస్తాడు. ఆ సన్నివేశం మనసున్నవాళ్ళనెవరినైనా కంటతడి పెట్టించకమానదు. అది కేవలం కథలో పాత్ర కాదు. నిరాదరణకు లోనవుతున్న ఎందరో వృద్ధులకు ప్రతినిధి ఆ పెద్దావిడ.

* * *

"కూసంత చోటియ్యమ్మా నించోడానికి ఓపికలేదు" అంది దుర్గమ్మ బస్‌లో ఓ బక్కపల్చటి స్త్రీని ఉద్దేశించి.

ఆవిడ చిరాగ్గా చూసి "ఆ రెండు సీట్లూ దాటుకుంటూ వచ్చి నన్నడుగుతావే?" అంది.

''వాళ్ళు లావుగా వుండబట్టి నిన్నడుగుతున్నా. కడుపుతో వున్న మనిషికి కాసింత చోటివ్వకపోగా, నోరు తెరిచి అడిగితే కూడా విసుగామ్మా?" అంది దుర్గమ్మ.

"అఫ్టరాల్ సీట్‌కోసం కడుపెందుకు తెచ్చుకుంటావులే?" కోపంగా అంది ఆ అమ్మాయి.

"అమ్మా తల్లీ, అంత అబద్దాలెందుకు

"ఏదోలెమ్మా, వేమందర్లా పెట్టిపుట్టినాళ్ళం కాము" అంది దుర్గమ్మ ఒకవిధమైన విరక్తితో.

"చాల్లే, ఇంక మాట్లాడకు. మామూలుగా ఎలా వున్నా గర్భవతిగా వున్నప్పుడు బాగా తినాలి. నీకెన్ని ఇబ్బందులున్నా సరే, కడుపులో పిల్లను దృష్టిలో వుంచుకునైనా బాగా తిను. తల్లి బాగా తింటేనే కదా లోపల పిండం చక్కగా ఎదుగుతుంది.. ఆ మాత్రం తెలీదా? రేపు సరిగా ఎదగని పిల్ల పుడితే జీవితాంతం ఏడ్వాలి.. ఇంద ఈ డబ్బుంచుకో" అంటూ పర్సులోంచి వందనోటు తీసిచ్చింది. 'పైకి కఠినమనిపించు, లోన వెన్న కనిపించు' అంటే ఇదేనేమో. ఆవిడ ఔదార్యానికి సంతోషిస్తూ ''ఏ తల్లి కన్నబిడ్డవో గానీ, పదికాలాలపాటు చల్లగా వుండమ్మా'' అంటూ చెమర్చిన కళ్ళతో చూసింది. అవును మరి సాధారణంగా ఎవరైనా గర్భవతని తెలిసినప్పటినుంచి ప్రత్యేక శ్రద్ధతో ఇద్దరి ఆహారం తీసుకుంటారు కనుక కండపట్టి నునుపుతేలి దాదాపు పదిహేను కిలోల అదనపు బరువు పెరుగుతారు. అలాంటిది దుర్గమ్మ ఊపిరే లేనట్టు నీరసంగా, నిస్సత్తువగా వుంది.

* * *

కరుణాకర్ వాకిట్లో కూర్చుని పేపర్ చదువుకుంటోంటే "సార్!" అనే పిలుపు వినిపించి ప్రశ్నార్థకంగా చూశాడు.

అంతే ఏడేళ్ళ పిల్లాడు బాణంలా

"ఆకలేస్తోంది.. ఏ పనైనా సరే చెప్పండి" అంటోంటే ఆ పిల్లాడి కళ్ళలోంచి నీరు కారిపోతున్నాయి.

కరుణాకర్‌కి మనసంతా మెలిపెట్టినట్లయింది. పళ్ళెంలో పదార్థాలన్నీ వేడిగా వడ్డించి పదిసార్లు కేకలు పెట్టినా తినడానికి రాని తన పిల్లలు కళ్ళముందు మెదిలారు. 'అభంశుభం తెలీని వీడికిన్ని అగచాట్లా? ఐదారేళ్ళ బుడతడు తిండికోసం పనిచేస్తానంటున్నాడా' అనుకునేసరికి చలించిపోయాడు. ఇలాంటివి ఎన్నో పేపర్లో చదివినా స్వయంగా అనుభవంలోకి వచ్చేసరికి భరించడం కష్టంగా అనిపించింది. దాన్ని జీర్ణించుకోలేనట్లు పాలిపోయిన ముఖంతో గుడ్లప్పగించి చూశాడు. అంతలోనే తేరుకుని ఒక్కుదుటున లేచాడు. ఏ పనిలోనో కూరుకుపోయిన భార్యను పిలిస్తే ఆలశ్యం కావచ్చనిపించడంతో పరుగులాంటి నడకతో హాల్లోకెళ్ళి, డైనింగ్‌టేబుల్ మీదున్న హాట్‌ప్యాక్‌లోంచి రెండు పూరీలు తీసి, ఆలూ కర్రీ కూడా అందులో వేసి అంతే వేగంతో వెళ్ళి ఆ బాబు చేతిలో పెట్టాడు. ఆ క్షణంలో పిల్లాడు చూసిన కృతజ్ఞతాసూచకమైన చూపు కరుణాకర్ గుండెలో గుచ్చుకుంది. 'పిల్లలకు మంచి పౌష్టికాహారం పెట్టాలని డాక్టర్లు పదేపదే హెచ్చరిస్తుంటారు. మరి వీళ్ళకేమో కనీస తిండి కూడా లేదు' అనుకునేసరికి అవ్యక్తమైన బాధతో కళ్ళు మూసుకుని కణతలు నొక్కుకున్నాడు కరుణాకర్.

* * *

సీరియల్

గొల్లపూడి నారాయణరావు

తెల్లమొగాలు

(గతవారం)

అల్లుడి సేవాతత్వాన్ని గుర్తించకుండా అతణ్ణి తప్పువడ్తూ మాట్లాడిన భార్య రంగనాయకమ్మను మందలించడమేగాక చెంపదెబ్బ కూడా వేసిన కోదండరాంరెడ్డి, అలా ఎందుకు చేశానా అని పశ్చాత్తాపుడ్తూ పడుకోగా కూతురొచ్చి లేపింది.

(33వ భాగం)

కోదండరాంరెడ్డి లేచి కూర్చున్నాడు. అతడి మొహం గొప్ప విచారంలో మునిగి ఉన్నట్లుగా ఉంది. అతడు కూతురి వైపుకు చూసి విసుక్కున్నాడు. "అబ్బబ్బ... తినబుద్ధి కానిదే ఎట్లా తినమంటావమ్మా" అన్నాడు.

"తినబుద్ధి కాకపోవడమేంటి నాన్నా? నీ మనసులో ఏదో విచారం పెట్టుకున్నావు. అదేంటో మాకుచెప్పు. వింటాం కదా"

కోదండరాంరెడ్డి తలూపి "వింటావా, అయితే విను చెప్తాను. మీ నాన్న పచ్చి దొంగ. పరాయివాళ్ల పంటలన్నీ దోపిడీ చేయించి ఇంటికి తెచ్చుకునే బందిపోటు దొంగ" అన్నాడు. కళ్ల వెంట బొటబొట నీరు కారింది. "ఇంతరకూ బాగానే జరిగిపోయింది. గ్రామంలో కల్లా మంచివాడని పేరు మోశాను. కానీ ఈనాటికీ ఈ పేరు మోయవలసొచ్చింది" అన్నాడు తిరిగి అతడి మాటలు దు:ఖంతో తడబడుతున్నాయి.

భార్యా, కూతురు ఇద్దరూ తెల్లమొగాలు వేశారు!

"నీవు దొంగవని ఎవరన్నారు నాన్నా?" అంది అఖిలాండం.

"నీవు దొంగవని ఎట్లా అన్నారయ్యా? వాళ్ళ నోళ్లు పడిపోను. వాళ్ల నాలుకలు తెగిపోను" అంది రంగనాయకమ్మ.

కోదండరాంరెడ్డి నిన్న సాయంత్రం తోటవద్ద నుండి వస్తున్న సమయంలో జానకిరాంరెడ్డి ఎదురుపడడం, అతణ్ణి తాను మందలించడం – విషయమంతా పొల్లుపోకుండా చెప్పాడు. చివరికి "పటేలు మాగాణిలోని వరిపంటనంతా నేను దోపిడీ చేయించానట" అన్నాడు.

రంగనాయకమ్మ తిట్లు ప్రారంభించింది. "వాడి ఎడమార, వాడి ఇల్లు వల్లకాడుకాను, వాడింట్లో జిల్లేళ్లు, జీలుగులు మొలవ. వాడెందుకు నిన్నంతటి మాట అన్నాడయ్యా? పచ్చి దొంగముండాకొడుకు, పక్కవాళ్ల చేలల్లో పసరు దోసకాయలనూ బతకనివ్వడు. అందుకేనా? ఆ కోపంలో వచ్చి నా చెంప పగలగొట్టావు?" అంది.

కోదండరాంరెడ్డి తలొంచుకున్నాడు. అఖిలాండం మరింతగా తెల్లమొగం వేసి నిల్చుంది. ''నాన్న నిన్ను కొట్లాడా అమ్మా''

"అవునే నిన్న ఊరికే చెంపపై పెట్టి బాదాడు. ఈ ఇంట్లో అడుగుపెట్టిన తర్వాత ఇంతవరకూ దెబ్బపడలేదు" అంది రంగనాయకమ్మ. ఆమె కన్నీరు కార్చింది.

అంతలోనే వాడజనం అంతా ఒక్కసారిగా బెకబెకలాడుతూ వచ్చారు. ఇంటి బయట పందిట్లో నిలబడ్డారు. ముఠామేస్త్రీ సుందరం "కోదండయ్యగారూ" అని కేకపెట్టాడు.

"కూలి జనమంతా వచ్చారు. ధాన్యం కొలవాలేమో, చానా ఆలస్యమవుద్ది రెండు మెతుకులు తినిపోరాదూ?" అంది రంగనాయకమ్మ.

కోదండరాంరెడ్డి జవాబివ్వలేదు. నెమ్మదిగా లేచినిలబడ్డాడు. బయటికి నడిచి "ఏమిరా సుందరం, కూలిధాన్యంకోసం వచ్చారా?" అనడిగాడు.

సుందరం తలూపాడు. కోదండరాంరెడ్డి "ఏసూ" అంటూ కేకపెట్టాడు. ఎడ్ల కొట్టంలో పురిచుట్టుకుని తాళ్లు నేస్తోన్న ఏసురత్నం ఆయన పిలవగానే చేస్తున్న పని నాపేసి అక్కడికొచ్చాడు.

"గరిసె మెత్తతీసి ధాన్యం పోయరా?" అని చెప్పాడు కోదండరాంరెడ్డి.

ఏసురత్నం తలగుడ్డ చుట్టుకుని గరిశెపైకి ఎక్కాడు. ధాన్యంపై మెత్తిన మట్టినంతటినీ తీసి బయటపడేస్తున్నాడు. కోదండరాంరెడ్డి సుందరాన్ని దగ్గరికి పిలిచాడు. సుందరం అతడి సమీపంలోకి వచ్చి కూర్చున్నాడు.

మిగతా వాడ కూలీలందరూ కోదండరాంరెడ్డి ఏం చెప్తాడోనని నిశ్శబ్దంగా కూర్చున్నారు.

"సుందరం, మీ వాడవాళ్లు గాని పటేలు మాగాణిలో పంటలు కోసుకొచ్చారా?" అనడిగాడు కోదండరాంరెడ్డి.

సుందరం తెల్లమొగం వేశాడు. "మేం కోసుకురావడమేంటి అయ్యగారూ" అన్నాడతను.

"మీలో ఎవరివల్లనయినా జరిగితే నిజం చెప్పండి" అన్నాడు.

''రామ, రామ, ఎంతమాటన్నారు అయ్యగారూ? మనవాడ వాళ్లందరి సంగతి తమకు తెలుసునుగదా? ఎంతటి కరువు రోజుల్లోనయినా కలోగంజోతాగి బతుకుతున్నామే కానీ అట్లాంటి పనులు మావల్ల ఎప్పుడూ జరగలేదుగదా" అన్నాడు సుందరం.

"తెలుగుగడ్డ వాడవాళ్లం ఇంతవరకూ నీతిగానే బతుకుతున్నాం దొరా" అన్నాడు దానేలు.

"అసలింత వాదును మాపై పుట్టించింది ఎవరయ్యగారూ?" అడిగాడు మరియప్ప.

"మీ ఒక్కళ్లమీదనే కాదులే, మీతోపాటు నేనూ ఒక దొంగనయ్యాను. పటేలు పంటనంతటినీ కోయించి ఇంటికి తెచ్చుకున్నానట" అన్నాడు కోదండరాంరెడ్డి.

"మీటోటి పెద్దమారాజులను అంతమాట ఎవరన్నారయ్యగారూ, ఇంకా మాబోటిగాళ్లను అన్నా పరవాలేదుగానీ" అన్నాడు సుందరం.

కోదండరాంరెడ్డి తనకూ, జానకిరాంరెడ్డికీ మధ్య జరిగిన మాటలన్నీ చెప్పాడు.

"ఇలాంటి అభాండాన్ని మీ నెత్తిన కలిసి వేశాడోయ్" అన్నాడు.

అందరినీ చూశాడు. "ఈ వయసులో ఇట్లాంటి చెడుపేరు మోసిన తర్వాత ఇంకా బతకడం ఎందుకూ?" అన్నాడు.

అక్కడే పెద్ద దర్వాజ నానుకుని కూర్చున్న రంగనాయకమ్మ కలిగించుకుని "చాల్లే ఊరుకోవయ్యా ఏం మాటలవి? వాడేవో ఊసుపోని మాటలంటే వాటినే పట్టుకుని ఊగులాడుతావ్" అంది.

"దొరా, మీరు జానకమ్మ గారంటే గుర్తొచ్చింది. పటేలుగారి పొలంలో ధాన్యం కొట్టించి ఆయనే తన పాతరలో పోయించుకున్నాడు గదా" అన్నాడు మరియప్ప.

''నిజమేనా మరియడూ'' అన్నాడు కోదండరాంరెడ్డి.

''నిజమే అయ్యగారూ, నామాట అబద్ధమనుకుంటే మా బావమరిదిని పిలిపిస్తాను కనుక్కోండి అన్నాడు" మరియప్ప.

"మీ బావమరిది ఏ ఊరు?" ప్రశ్నించాడు కోదండరాంరెడ్డి.

"పులిగూడెం లెండి జానకయ్యగారు. ఈ సంవత్సరం వాళ్లతోనే ఆ కాస్తా కోయించి ధాన్యం ఇంట్లో పోసుకున్నాడు" అన్నాడు మరియడు.

"అట్లాగా?" అన్నాడు కోదండరాంరెడ్డి. "ఇంట్లో పోసుకుని దొంగకూతలు కూస్తున్నాడా?" దొంగవెధవ" అన్నాడు తిరిగి.

''కూస్తే మానెలెండి. ఇంతలో మనమేమయినా చెడిపోయామా? ఆయనేమయినా బాగుపడ్డాడా?" అన్నాడు.

మధ్య రంగనాయకమ్మ కలిగించుకుంది. "ఈ మాట విన్న దగ్గర్నుంచీ ఈ మనిషికి అన్నంలేదు, నీళ్లూ లేవు. ఇంతవరకూ లేచి ముఖం కడగనేలేదు. మీరంతా వచ్చి పిలిచేసరికి ఇప్పుడే లేచి బయటికి రావడం" అంది.

"కుక్క అరిస్తే జంగం పరపతి చెడుద్దా అని శాస్త్రమే ఉందిలెండి. అయినా అట్లాంటి మారాజును పట్టుకుని అనరాని మాటలంటే ఆయన నోట్లోనే పురుగులు పడతాయి'' అన్నాడు మరియప్ప.

అప్పటికి ఏసురత్నం మెత్తదీయడం పూర్తయిపోయింది. ధాన్యం గంపకు ముంచిస్తుంటే సుందరం అందుకుని కింద గుమ్మరిస్తున్నాడు. సుమారు రెండు పుట్ల ధాన్యం రాశిపడింది. ఏసురత్నం గరిశెలో నుండి కిందకి దిగొచ్చాడు. మానిక తీసుకుని కొలవడం ప్రారంభించాడు. కూలీలు వెంటనే మూటలు కట్టుకుంటున్నారు.

ఏసురత్నం పద్నాలుగు బస్తాల ధాన్యం కొలిచి ఆగాడు.

"వాళ్ల కూలివరకు పూర్తిగా కొలిచాను అయ్యగారూ" అన్నాడు.

కోదండరాంరెడ్డి తలూపాడు. "ఇంకో యాభయి మానికలు కొలువు, ఉలఫా కింద సరిపోతాయి" అన్నాడు.

ఏసురత్నం తిరిగి కొలత ప్రారంభించాడు.

"ధర్మగుణం గల దాతలు" అన్నాడు మరియప్ప.

"అడగకుండానే అయ్యగారు బస్తా వడ్లు కొలిపిస్తున్నారు" అన్నాడు ఇంకొకడు.

"భారీ చెయ్యిగల మారాజు" అన్నాడు మరొకడు.

ఈ విధంగా వాడ జనాభాలో కోదండరాంరెడ్డి గురించి మెచ్చుకోళ్లు వినిపిస్తున్నాయి. ఏసురత్నం యాభై మానికలు కొలవడం పూర్తయింది. కూలీలు మూటలు కట్టుకుంటున్నారు. సుందరం లేచి నిల్చుని "ఇక సెలవిప్పించదయ్యా వెళ్తాము" అన్నాడు.

కోదండరాంరెడ్డి చిరునవ్వుతో "వెళ్లిరండి" అన్నాడు.ల

అందరూ మూటలెత్తుకుని వెళ్లిపోయారు.

"ఇకనయినా భోజనానికి వస్తారా?" అంది రంగనాయకమ్మ. కోదండరాంరెడ్డి మారుమాట లేకుండా లోపలికి నడిచాడు. అప్పటికప్పుడే ఉదయ కాలకృత్యాలన్నింటినీ తీర్చుకుని స్నానం చేసి వచ్చాడు.

రంగనాయకమ్మ అన్నం వడ్డించి ఎదురుగా కూర్చుంది. "చూశావటే, జానకయ్య ఎంత అబద్ధాలకోరుగా మారిపోయాడో" అన్నాడు కోదండరాంరెడ్డి.

''ఎవరినయినా సొమ్ము అశుద్ధం తినిపిస్తుంది" అంది రంగనాయకమ్మ.

"అలాగే కన్పిస్తోంది మరి. ధాన్యం ఇంట్లో పోసుకుని ఊరందరిమీదా అభాండాలు వేస్తున్నాడు" అన్నాడతను.

"ఏమోలే ఊరికినే మధ్య నా చెంప....." అంటూ చెంపపై చేయి పెట్టుకుని నిమురుకుంది.

అతడు నవ్వాడు. ఆమె చెంపపై చేయి వేశాడు. ''నిజమే, అన్యాయంగా నీ చెంప నలిగిపోయింది" అన్నాడు.

ఆమె అతడి చేతిని తీసివేసి "చాల్లే, చెంప పగలగొట్టిందిగాక సరసాలూ సాగించావు?" అంది.

"మళ్లీ ఒక అభాండం నెత్తిన వేయడానికి కూర్చున్నావా? చెంప పగిలిందన్నందుకు నేనేదో పరామర్శ చేస్తుంటే చేయితీసి విదిలిస్తావేమిటి?" అన్నాడు.

"ఇదిగో ఏమిటయ్యా, నీ మాటలూ" అందామె.

"మరి లేకపోతే ఏమిటే? ముసలాణ్ణి పట్టుకుని సరసం సాగిస్తున్నానంటావేమిటి?'' అన్నాడతడు.

"ఇదిగో నీకు దండం పెడతానుగాని నోరు మూసుకోవయ్యా. అవతల గదిలో అమ్మాయి ఉంది. దాని చెవిన ఈ మాటలు పడ్డాయంటే ఇంకేమైనా ఉందీ?" అందామె.

దాంతో అతడు మాట్లాడకుండా భోంచేయనారంభించాడు.

❂ ❂ ❂

సాయంత్రం బారెడు పొద్దుపోయింది. కోదండరాంరెడ్డి బయట్నించి వస్తూనే "అమ్మాయ్ అఖిలాండం" అని పిలుస్తూ లోపలికొచ్చాడు.

"ఏమిటి నాన్నా?" అంది అఖిలాండం. ఆమె మధ్యహాలులో చాపపై కూర్చుని తల దువ్వుకుంటోంది.

"పత్రిక తీసుకొచ్చానమ్మా. ఇందులో మీ ఆయన వార్తలున్నాయి" అన్నాడాయన.

అఖిలాండం గబగబా జడవేసుకుని తండ్రి వద్ద పత్రిక తీసుకుంది. అంతలోనే రంగనాయకమ్మ తడిచేతులు తుడుచుకుంటూ లోపల్నించి వచ్చింది. "ఏదమ్మా చదువూ, మీ ఆయన ఘనకార్యం కాస్త విందామూ" అంది.

కూతురు నవ్వి పత్రిక తెరిచింది. మొదటి పేజీలోనే ఉన్న ప్రతాప్‌రెడ్డి ఫోటో చూసింది. "అమ్మా, ఆయన తస్వీరుగూడా వేశారు చూడు" అంది.

రంగనాయకమ్మ వంగి చూసి "అచ్చు మీ ఆయనలాగే పడిందేమే" అంది.

అఖిలాండం తిరిగి నవ్వి, చేతిలో తుపాకీ పుంచుకొని సైనిక దుస్తుల్లో వున్న భర్త నుదుటిపై ఆకర్షణీయంగా వ్యాపించిన ముంగురులవైపుకు తీక్షణంగా చూస్తోంది.

(ఇంకా వుంది)

క్యాంపస్ భేటీ

కె శివలీల

మాకు తెలీవనుకోకు...

రైలు ఆగితే చాలు చకచకా తలదువ్వుకుంటావ్... వేసుకున్న డ్రెస్సెక్కడ నలిగిపోతుందోనని ఎప్పుడూ ఆ డోర్‌దగ్గర వేలాడుతూ కనిపిస్తావ్... నువ్వు మా గురించి మాట్లాడుతున్నావా? అదీ బ్యూటీ పార్లర్ విషయం...

చెలాకీగా కవ్వించే కళ్లు... విరిసీవిరియని చిరునవ్వు... ఇస్త్రీ నలగని బట్టలు... వెళ్లేది కాలేజీకి బాబూ... ఆ మాత్రం రెడీ కాకపోతే ఎలా? మీ ఇల్లు కాలేజీకి దగ్గరేనా? అయితే పర్లేదు. ఇల్లు కాలేజీకి దూరంగా ఉందనుకోండి. కాలేజీకి వెళ్లడానికి దాదాపు రెండుగంటలు ప్రయాణించాల్సి వచ్చిందనుకోండి, అదీ రైల్లో... గమ్యాన్ని చేరుకునేసరికి వారెలా ఉంటారు? చిందరవందరగా ఉన్న జుట్టు... అలసటను సూచిస్తున్న కళ్లు... నలిగిన బట్టలు... చిరాగ్గా ఉన్న మొహం వెరసి... ఎప్పుడెప్పుడు నిద్రపోదామా అని కాచుక్కూర్చుంటారు కదూ. "మేం ఈ కోవకు చెందమంటున్నారు" తుంగభద్ర ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తోన్న కొందరు విద్యార్థులు. ఎలాగో తెలుసుకోవాలనుకుంటున్నారా?

"రోడ్డుమీద నడుస్తుంటే... ఎదురొచ్చిన వారెవరైనా చటుక్కున చూపు తిప్పేసుకుంటారు. మళ్లీ చూడడానికి సాహసించరు మరి కొందరు. 'ఎందుకమ్మా... ఇలా మమ్మల్ని జడిపిస్తావ్...' లాంటి కామెంట్స్ మామూలే... ఎందుకంటే... తలకూడా చక్కగా దువ్వుకోం మరి. జస్ట్ ఫ్రెష్ అయి బయల్దేరతామంతే. ఓ బాక్స్‌లో బ్రేక్‌ఫాస్ట్ తెచ్చేసుకుంటాం. ఇక మేకప్ సంగతంటారా? అదీ ట్రైన్‌లోనే. లేడీస్‌కంపార్ట్‌మెంట్‌లో అయితే రష్‌గా ఉంటుంది. మేకప్పవ్వడానికి అస్సలు వీలుండదు. అందుకే జనరల్ కంపార్ట్‌మెంట్‌లోనే ఎక్కుతాం. మరి అందరూ చూస్తారు కదా? హూ కేర్స్... వారి గురించి ఎవరు పట్టించుకుంటారు చెప్పండి. మా క్లాస్‌మేట్స్‌కూ, ట్రైన్లో రోజూ వచ్చే ఉద్యోగులకూ ఇది మామూలే. ఇక కొత్తవారి సంగతంటారా? వారేమనుకుంటే మాకెందుకు చెప్పండి... మేం కాలేజీలోకి అడుగుపెట్టేటప్పుడు ఫ్రెష్‌గా ఉన్నామా లేదా అన్నదే పాయింటు" అంటున్నారు ఇంజనీరింగ్ విద్యార్థినులు ప్రశాంతి, శ్రావణి.

"లేచేసరికే ఏడవుతుంది. స్నానం చేసి, బాక్స్ రెడీ చేసుకునేసరికి ట్రైన్ టైమైపోతుంది. ఇక మేకప్పవుతూ కూర్చోడమంటే డెఫినెట్‌గా ట్రైన్ మిస్ చేసుకోవడమే. అంత రిస్కుతీసుకోవడం అవసరమా? ట్రైన్‌లో కూర్చుని ఏం చేస్తాం? చుట్టూ చూస్తుండడమేగా. టైం వేస్టు. ఆ సమయంలో తీరిగ్గా మేకప్పవ్వొచ్చు. మేకప్ కంప్లీట్ అయ్యేసరికల్లా మా కాలేజీ వచ్చేస్తుంది. ఫ్రెష్‌గానూ కనిపించొచ్చు. టైం సేవ్ చేసినట్లూ ఉంటుంది. ఏమంటారు?" అంటోంది స్మిత.

"ఆరోజు... మా కాలేజీడే. నేను రైల్లో మేకప్పవుతున్నాను. ఇంతలో మా ఫ్రెండ్స్ కాల్ చేశారు. నేను మాటల్లో పడిపోయాను. ట్రైన్ ఆగింది. నేను హడావిడిగా దిగిపోయాను. ఆటో ఎక్కాను. కాలేజీ వైపుగా సాగిపోతోంది ఆటో... ఏదో మర్చిపోయిన ఫీలింగ్... వామ్మో... నా మేకప్‌కిట్... ట్రైన్‌లోనే ఉండిపోయింది. ఛ... దాన్లో ఉన్నది చాలా కాస్ట్‌లీ మేకప్‌సామాన్లు. అవి పోయాయంటే ఇంకేమన్నా ఉందా? దాదాపు పరిచయం ఉన్న వారందరికీ చెప్పాను నా మేకప్ కిట్ గురించి. వాళ్లంతా రోజూ ట్రైన్లో వచ్చేవారే. రెండ్రోజులు గడిచాయి. ఓరోజు నా స్నేహితురాలు నా దగ్గరికొచ్చి "ఏయ్ నీలూ... నీ మేకప్ కిట్ ఇదిగో. నాకు తెలిసినావిడకు ఈ విషయం చెప్పాను. మాటల మధ్యలో ఆవిడ ఎవరితోనో అన్నార్ట. అలా మెసేజ్‌పాసైంది. ఎవరో వేరే ఆవిడకు ఇది కనిపించిందట. నీ దగ్గరికి చేరేసరికి రెండ్రోజులు పట్టింది. ఇప్పుడు హేపీనేనా...." అని అడిగింది. "హమ్మయ్య మళ్లీ ఆ మేకప్ సామాన్లు కొనే బాధ తప్పింది అని చాలా సంతోషించాను" చెప్పింది నీలిమ.

"ఇంట్లో మేకప్పయి రావచ్చుగా... అంత ఫ్రెష్‌గా కనిపించాల్సిన అవసరమేముంది? కాలేజీలో ఏమైనా బ్యూటీ కాంటెస్ట్ కండెక్ట్ చేస్తారా ఏంటి? ట్రైన్‌లో కూర్చున్నదాలస్యం... ఇక మేకప్పవడం షురూ చేస్తారు. కొన్నిరోజులు గడిస్తే... ఫేస్‌ప్యాక్, హెన్నావంటివీ ట్రైన్‌లోనే పెట్టుకునేలా ఉన్నారు. ట్రైన్‌లోనూ బ్యూటీపార్లర్లు వస్తాయేమో భయంగా ఉంది" అంటున్న తన సహవిద్యార్థి మాటలకు "ఏంటీ సంగతి... మా మేకప్ గురించి పెద్ద లెక్చర్లు దంచేస్తున్నావ్..." అంటూ వేగంగా స్పందించిందో అమ్మాయి. "నువ్వంటున్నట్లు ట్రైన్లో బ్యూటీపార్లర్లు వస్తే బెటరే... చక్కగా ఫేషియల్, హేర్ కట్ లాంటివి చేయించుకోవచ్చు. టైం చాలా సేవ్ అవుతుంది. అయినా రైలు ఆగితే చాలు చకచకా తలదువ్వుకుంటావ్... వేసుకున్న డ్రెస్సెక్కడ నలిగిపోతుందోనని ఎప్పుడూ ఆ డోర్‌దగ్గర వేలాడుతూ కనిపిస్తావ్... నువ్వు మా గురించి మాట్లాడుతున్నావా? అదీ బ్యూటీ పార్లర్ విషయం... "జాన్ అబ్రహాంలాంటి హెయిర్‌స్టైల్‌నాకు సూటవుతుందా?" అని జెంట్స్ బ్యూటీపార్లర్‌లో నువ్వు ఎంక్వైరీ చేసిన సంగతి మాకు తెలియదనుకుంటున్నావా? మేం నిన్ను నీడలా వెంటాడకపోయినా... నీ విషయాలేవీ మాకు తెలీవనుకోకు..." అంటూ దడదడలాడించేస్తున్న ఆ అమ్మాయి చూస్తుంటే... "అమ్మో... ఈ కాలం అమ్మాయిల్ని తక్కువగా అంచనా వేయలేం" అనుకున్నారక్కడి వారంతా. మరి మీరో...

చందు

కేవలం టాలెంటే సరిపోదు



'మల్లెమొగ్గలు' సినిమాలో ఉన్నావని తెలిస్తే 'ప్రతిఘటన' లెవెల్లో నిన్ను ఊహించుకుంటారు. ఈ సినిమాలో నీ వేషం అంత బాగోలేదు. ఇందులో యాక్ట్ చేస్తే నీకే నష్టం' అని పంపించేశారు. ఆయన ఉద్దేశం నటుడిగా ప్రేరణ కలిగించింది. అమితానందం కలిగింది.

పెద్ద గుమ్మడి కాయంత టాలెంట్ ఉంటే సరిపోదు. ఆవగింజంత అదృష్టం కూడా ఉండాలి.

నేనొక్కడినే కాదు పాపులారిటీ ఉన్న ప్రతి ఆర్టిస్టూ ఒకప్పుడు బాధలు పడినవారే. బాధలన్నీ నాటకాలు ఆడేటప్పుడే పడ్డాం. నేనెప్పుడూ వేషాలకోసం మద్రాస్‌లో ఆఫీసుల చుట్టూ తిరగలేదు. ఇవ్వాళ నాకు గుర్తింపు వచ్చింది కాబట్టి ఇంటర్వ్యూ చేస్తున్నారు. నాతోపాటు, నాకన్నా కష్టపడ్డవాళ్ళు చాలామంది ఉన్నారు. మద్రాస్ వెళ్ళి ఆఫీసుల చుట్టూ తిరగడం వంటివి లేకుండా 'భగవంతుని దయ...' లేదా మరేదైనా కానివ్వండి 'ప్రతిఘటన' చిత్రం కెరీర్ గ్రాఫ్‌ను పీక్ స్టేజ్‌కి తీసుకెళ్ళింది. సినిమా రిలీజ్‌కి ముందేమో కింద కూర్చుని ఉన్నా. ఆ మర్నాటినుండి కెరీర్ ఆకాశంలో నడవడం మొదలుపెట్టింది. అది గొప్ప అదృష్టం కదా! ఒడిదుడుకులంటారా... ప్రొఫెషన్‌లో అవి సహజం. మన పర్సనల్ బిహేవియర్ వల్ల ఇబ్బంది పడేవి ఉంటాయి. అవతలివాళ్ళ వల్ల మనం ఇబ్బంది పడేవి ఉంటాయి. మనం చేసేది అందరికీ నచ్చాలని లేదు కదా. మనమంటే ఇష్టపడేవాళ్ళుంటారు. ఇష్టపడని వాళ్ళూ, ఈర్ష్య పడే వాళ్ళూ ఉంటారు. అలాగే పక్కవాడి చెప్పుడు మాటలు విని మనం బ్యాడ్‌గా మాట్లాడిన సందర్భాలూ ఉంటాయి. బూమ్ పిరియడ్ వచ్చినపుడు మన జీవితం మన చేతుల్లో ఉండదు. ఇవన్నీ సహజం. పెద్ద గుమ్మడి కాయంత టాలెంట్ ఉంటే సరిపోదు. ఆవగింజంత అదృష్టం కూడా ఉండాలి. ఆ రెండూ ఉన్నవాడే కోట శ్రీనివాసరావు. ఇది నేను నమ్ముతా. నాకంటే మంచివాళ్ళూ, కష్టపడ్డవాళ్ళూ, టాలెంట్ ఉన్నవాళ్ళూ ఉన్నారు. కాకపోతే అదృష్టం వచ్చిన తర్వాత దాన్ని కాపాడుకోవడం మన గొప్పతనం.

ఎవ్వరినీ ఇమిటేట్ చేయలేకపోవడానికి కారణం...

నేనెవ్వరినీ ఇమిటేట్ చేయలేకపోవడానికి, నాకంటూ ఒక ప్రత్యేక శైలి ఉండడానికి కారణం... ఒక నాటక సమాజానికి కట్టుబడి నాటకాలు వేయకపోవడమే. ఎవరు పిలిస్తే వాళ్ళ ట్రూప్‌లో నాటకాలాడేవాణ్ణి. ఒకే నాటక సమాజంలో 20 సంవత్సరాలపాటు నాటకాలేసిన వాళ్లను చూస్తూ ఉంటాం కదా. ఆ సమాజ దర్శకుడు, తోటి నటీనటుల ప్రభావం వారిపై పడి జీర్ణించుకుపోతుంది.

నాటకంలో అంత చేస్తే ఇంత కనబడుతుంది. సినిమాలో ఇంత చేస్తే అంత కనబడుతుంది.

నాటకాల నుంచి రావడం సినిమాకు పెద్ద అడ్వాన్‌టేజ్‌గా అనుకోను కానీ అలా వచ్చిన నటుడికి ఆత్మవిశ్వాసం ఉంటుంది. అసలు నాటక రంగ ప్రక్రియ వేరు. సినిమా రంగ ప్రక్రియ వేరు. నాటకాలైతే నెల రోజులపాటు సాధన చేసి ప్రోగ్రాం ఇస్తాం. ఇక్కడలా కాదు. గదిలోకి రావడం ఇవ్వాళ తీస్తారు. వచ్చిన తర్వాత సన్నివేశాన్ని మూడు నెలల తర్వాత తీస్తారు. మూడు నెలల క్రితం ఏం చేశామో, ఎలా చేశామో గుర్తుంచుకోవాలి. బిజీ ఆర్టిస్టులకు ఒక్కో సినిమాలో ఒక్కోరకమైన వేషం ఉంటుంది. రోజుకి రెండు మూడు కాల్షీట్లు వివిధ చిత్రాలకు కేటాయించాల్సి ఉంటుంది. ఆయా క్యారెక్టర్స్ మూడ్‌లోకి వెళ్ళాలి. సినిమాది కొంచెం కష్టమైన ప్రక్రియ. రంగస్థలంపై బ్రహ్మాండంగా నటించిన వారందరూ సినిమాల్లో సక్సెస్ అయిపోతారనుకోవడం కూడా పొరపాటే. సినిమాలకి సరిపోకపోవచ్చు. నాటకంలో ఏడ్చే సన్నివేశం ఉందనుకుంటే ముందు కూర్చున్న మూడు వరసల వారికి బాగా కనబడతాం. ఆపైన వాళ్ళకి మసగ్గా కనబడతాం. అందుకే చేతులెత్తి, కాళ్ళెత్తి, అరచి ఆంగికానికి ప్రాధాన్యత ఇస్తూ ఉంటాం. సినిమా విషయానికొస్తే... ఉదాహరణకు కన్ను అంగుళం ఉంటుంది. దీన్ని క్లోజ్ షాట్ తీస్తే 35 ఎం.ఎం.గా కనబడుతుంది. అంటే నాటకంలో అంత చేస్తే ఇంత కనబడుతుంది. సినిమాలో ఇంత చేస్తే అంత కనబడుతుంది. అంత కనబడుతుంది కాబట్టి ఇంతకి దిగజారి దాన్ని కంట్రోల్ చేయడం గొప్ప టెక్నిక్. ఆ ప్రక్రియను పట్టుకున్నవాడు సినిమా రంగంలో సక్సెస్ అవుతాడు. మిశ్రో, కృష్ణచైతన్య, భానుప్రకాష్, కె. వెంకటేశ్వరరావుగార్లు రంగస్థలంపై విశేష ప్రతిభ కనబరిచిన వాళ్ళే. కానీ సినిమారంగంలో సక్సెస్ కాలేకపోయారు. అందం విషయమంటారా... సినిమా యాక్టర్ అంటే అందంగా ఉండాలన్న రోజులు పోయాయి.

ఉపకారం చేశానో లేదో తెలియదు కానీ నష్టం మాత్రం లేదు

రాజకీయరంగంలో కూడా యాదృచ్ఛికంగానే ప్రవేశించాను. పెద్దగా ప్రయత్నాలు చేయలేదు. మైకు పట్టుకుని మాట్లాడగలడు, పార్టీకి ఇతను అవసరం అని బి.జె.పి. భావించి పోటీ చేయమని అడగడం, టెమ్ట్ అయి నిలబడ్డాను కానీ, ఏమైనా సరే రాజకీయాల్లోకి వెళ్ళాలన్న దృఢ నిశ్చయంతో అందులో అడుగు పెట్టలేదు. రాజకీయాల్లో సక్సెస్ అయ్యానా, లేదా అన్న మాట అటుంచితే మన వల్ల ఎవ్వరికీ చెడు మాత్రం జరగలేదు. నేనెవ్వరికైనా ఉపకారం చేశానో లేదో తెలియదు కానీ నష్టం మాత్రం లేదు.

సినిమా వాళ్ళతో గడపాలంటే బోరుగా ఉంటుంది

నాలో ఉన్న చెడ్డగుణం కానివ్వండీ... మంచి గుణం కానివ్వండీ... వర్త్ ఉన్నవాడు చిన్నవాడా, పెద్దవాడా అనేది చూడను. చిన్నవాడైనా ప్రేమతో ఉంటా. ఎంత పెద్దవాడైనా విషయం లేకపోతే అసలు పట్టించుకోను. సినిమా యాక్టర్‌ని అయినా నాకు బయట స్నేహితులే ఎక్కువ. రోజుకి 20 గంటలు సినిమా వాళ్ళతో గడిపి ఏమన్నా తీరిక దొరికితే మళ్ళీ సినిమా వాళ్ళతో గడపాలంటే బోరుగా ఉంటుంది. అందుకే తీరిక సమయాన్ని మిత్రులతో గడపడానికి ఇష్టపడతాను.

మొక్కలు ఎక్కువగా పెంచితే...

వి.మల్లేష్, 3వ తరగతి,
మాణికేశ్వరి నగర్, హైదరాబాద్.

వర్షాలు బాగా పడతాయి.

సిహెచ్ ఉషాకిరణ్,
10వ తరగతి,
ఎస్.ఎన్.జి.హెచ్
స్కూల్, చేబ్రోలు,
గుంటూరు జిల్లా.

ఆ నీటిని కాలువల ద్వారా పంట భూములకు మళ్లించవచ్చు.



ఉమర్ ముక్తర్ జోషి, 6వ తరగతి,
ఎస్.ఎస్.ఎం.పబ్లిక్ స్కూల్, శ్రీనివాస నగర్
బ్యాంక్ కాలనీ, విజయవాడ-8.

చిన్నారి చిత్రకారులు

ఆ నీటితో పంటలు పండించవచ్చు.



వి.కార్తీకి, 4వ తరగతి, గౌతమి పబ్లిక్ స్కూల్,
ఏలేశ్వరం, తూర్పు గోదావరి జిల్లా.

మొక్కలు పెరిగి పెద్దయ్యాక బోలెడన్ని కాయలు కాస్తాయి.



ఐ.హిమవంత్ సత్య సాయిరాం,
7వ తరగతి, ప్రగతి విద్యానికేతన్, ప్రగతి నగర్.

చెరువుల్లోని నీరు జలచరాలను కాపాడుతుంది.



జి.హరీష్‌కుమార్, జి.నిరంజన్, 8వ తరగతి, ఎ.పి.ఎస్.
డబ్ల్యు.ఆర్ స్కూల్ (బోయిస్), మరిపెడ (బంగ్లా), వరంగల్ జిల్లా.



కె.నరేంద్ర,
ఒమ్మంగి, పత్తిపాడు (మం),
గుంటూరు జిల్లా.



ఇంత మంచి బొమ్మ వేసిన
చిన్నారి తన వివరాలు
రాయలేదు.



బి.దుర్గాప్రసాద్,
9వ తరగతి, రవీంద్రనాథ్
ఠాగూర్ విద్యాలయం,
వైరా.

వల్లందాసు మురళి, 9వ తరగతి,
జెడ్.పి.ఎస్ స్కూల్, కె.సముద్రం,
వరంగల్ జిల్లా.

అంతేనా... అడవులు బాగా పెరగడం వల్ల వన్యప్రాణులు, పశుపక్ష్యాదులకు రక్షణ లభిస్తుంది. కాలుష్యం తగ్గుతుంది. ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారు. మరి మనకింత మేలు చేస్తున్న మొక్కలను పెంచి పెద్ద చేద్దామా...

చుక్కలు కలిపి రంగులద్దండే



నలుపు చుక్కలెన్నబ్బా!



గడులు నింపండి



దారి కనుక్కోవడం ఎలా?

జవాబు

నలుపు చుక్కలెన్నబ్బా! 38

గడులు నింపండి

అడ్డం:

1.elephant, 4.acrobat, 6.animals.

నిలువు:

2.tightrope, 3.lion 5.clown.

అట్టమీది కథ

సెప్టెంబర్1-7 పోషకాహార వారోత్సవ సందర్భంగా 'తిండి కలిగితె కండ కలదోయ్' ప్రత్యేక కథనం.

అచ్యుతరావు మహా భోజనప్రియుడు. అప్పుడే భోంచేసినా సరే బూరెలు, గారెలు, మిర్చిబజ్జీ, బాదం హల్వాలాంటి తినుబండారాలేమైనా కనిపిస్తే చాలు 'అబ్బో ఏం ఘుమఘుమలు, నోట్లో నీరూరుతోంది' అంటూ వాటిని అందుకోబోతాడు. పక్కనున్న ఆయన భార్య "చాల్లే సంబడం, అవన్నీ అరగడానికి అరడజను టాబ్లెట్లు మింగాలి మళ్ళీ" అని అడ్డుకొంటుంది. "ఇందాక నెయ్యి కూడా తృప్తిగా వేసుకోనీకపోతివి, నీకిదేమైనా ధర్మంగా వుందా? నువ్వేం ధర్మపత్నివే?" అని దీనవదనం పెడతాడాయన. "ధర్మపత్నిని గనుకనే వెన్నంటి వుండి కొలెస్ట్రాల్ పెరక్కుండా చూస్తున్నాను" అంటుందావిడ తాపీగా. నిజమే మరి, ఆయన స్థూలకాయుడు. గుండెజబ్బుతో బాధపడ్తున్నాడు. డాక్టర్లు ఎక్కువ కాలరీలున్న ఆహారం తీసుకోవద్దని, భారీ శరీరాన్ని తగ్గించుకోడానికి విధిగా వాకింగుకు వెళ్ళాలని, వ్యాయామం చేయమని హెచ్చరించారు. కానీ ఆయన జిహ్వాచాపల్యం దాన్ని లక్ష్యపెట్టదు. భార్య కొంతవరకూ కంట్రోల్ చేస్తుందిగానీ ఆవిడ కన్నుగప్పి తింటూంటాడు అచ్యుతరావు. "కేవలం నడక సరిపోదు, జిమ్‌కు వెళ్ళమని" ఆవిడ పోరుతుంటుందిగానీ రేపూమాపూ అంటూ వాయిదాలు వేస్తుంటాడాయన. భోజనంమీద నిగ్రహం, నియంత్రణా లేక, పెరిగిన శరీరాన్ని తగ్గించుకోలేక పాటుపడ్తోన్న అచ్యుతరావులాంటి బలశాలులు కొందరైతే సరైన తిండిలేక బాధపడ్తోన్న సామాన్య ప్రజానీకం సంఖ్య గణనీయంగా వుంది. వివరాల్లోకి వెళ్దాం.

తిండి కలిగితే కండ కలదోయ్!

ఆర్. ప్రవీణ్ కుమార్

తెల్లారుతుంది.. మనం లేస్తాం.. హడావుడిగా రెడీ అయ్యి మన పనుల్లోకి దిగిపోతాం.. సాయంత్రమవుతుంది.. గూటికి చేరుతాం.. చీకటవుతుంది.. నిద్రపోతాం.. మళ్లీ తెల్లారుతుంది.. మళ్లీ లేస్తాం..

కానీ ఇలా రెండు సూర్యోదయాల నడుమ ప్రపంచవ్యాప్తంగా 30వేల మంది పసిపిల్లలు నిశ్శబ్దంగా చనిపోయారంటే మీరు నమ్మగలరా?

1939 నుంచి ఆరేళ్లపాటు జరిగిన రెండో ప్రపంచ యుద్ధంలో మొత్తం 6.2 కోట్లమంది చనిపోయారు. అంటే రోజుకు 28వేలమంది ఆ భీకర యుద్ధంలో ప్రాణాలు కోల్పోయారు. కానీ ప్రస్తుతం ఏ యుద్ధమూ లేని రోజున కూడా ప్రపంచవ్యాప్తంగా 30 వేలమంది చిన్నారులు కేవలం 'ఆకలి'కి బలవుతున్నారు. నిజం.

తిండి కలిగితే కండ కలదోయ్..
కండ కలిగినవాడేను మనిషోయ్..

నిజమే కండలేక, సరైన తిండిలేక పౌష్టికాహారలేమితో ఏటా ప్రపంచవ్యాప్తంగా చనిపోతున్న 'మనుషులు కానివారి' సంఖ్య 90లక్షలు. అమానుషం!

ఆకలిచావులనే నివారించలేని స్థితిలో, ఆహారధాన్యాల కొరతను తీర్చలేని పరిస్థితిలో పౌష్టికాహారం భారత గ్రామీణ సగటు జీవికి ఎంతవరకు లభ్యమవుతుందన్నదే కీలకమైన ప్రశ్న.

1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ మనదేశంలో ఆహారలేమి 'సైలెంట్ ఎమర్జెన్సీ'గా కొనసాగుతూ వస్తోంది. దేశంలో సంస్కరణలు ప్రవేశించాక, వ్యవసాయ రంగం క్రమంగా కుంటుపడుతూ వచ్చిన తర్వాత ఇది మరింత ప్రమాదకరమవుతూ వస్తోంది. గ్రామీణ మహిళ తిండికి కరువైన స్థితిలో సగం కడుపు నింపుకునేందుకే కాయకష్టమంతా సరిపోతోంది. మనదేశంలో 60శాతం మంది మహిళలు సరైన తిండిలేక పోషకాహారలేమితో బాధపడుతున్నారు. సహజంగా ఆ ప్రభావం వారి పిల్లలపై పడుతోంది. ప్రస్తుతం దేశంలోని నాలుగేళ్లలోపు పిల్లల్లో నగంమంది ప్రమాదకరస్థాయిలో పోషకాహారలేమితో ఉన్నవారే. భారత్‌లో నవజాత శిశువుల్లో 30శాతం మంది సరిపడా బరువూ, ఆరోగ్యం లేకుండా 'ఆకలి'కి చర్మం తొడిగినట్లుంటున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఈ పౌష్టికాహార లేమి కారణంగా తలెత్తే అంశాలతో, ఉదాహరణకు–ఉత్పత్తిలో తరుగుదల, అనారోగ్యం, మరణాలు, పసివాడుతున్న బాల్యం



పోషకాలివీ..

సాధారణంగా ప్రొటీన్లు, కార్బొహైడ్రేట్లతో కూడినవే దేహపుష్టికి దోహదం చేస్తాయి. ఇవి సాధారణంగా నాలుగు రకాల పదార్థాల్లో ఉంటాయి. (1)పిండిపదార్థాలు (2) కూరగాయలు (3) పళ్లు (4) పాలు (5) మాంసకృత్తులు. తిండిగింజలనుంచీ బ్రెడ్ వరకూ అన్నీ పిండిపదార్థాలే. ఇక మాంసం, కోడిగుడ్లు, బీన్స్, ఫిష్ అన్నీ మాంసకృత్తులే. వీటి నుంచి కార్బొహైడ్రేట్లను ప్రధానంగా శరీరం గ్రహిస్తుంది. ప్రతీరోజూ మూడు కప్పుల పాలు, 5 1/2 ఔన్సుల మాంసకృత్తులు, రెండు కప్పుల పళ్లరసం, రెండున్నర కప్పుల కూరగాయలు, 6ఔన్సుల పిండిపదార్థాలతో కూడిందే పౌష్టికాహారం అన్నది ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రమాణం. కానీ ఈ అయిదు అంశాలతో కూడి, 2,000 కాలరీల శక్తిని సమకూర్చగలిగితే చాలన్నది వైద్యులు చెబుతున్న విషయం.

ఇత్యాది కారణాలతో ఏటా భారత్ 45వేల కోట్లు నష్టపోతోందనేది అంకెలు చెబుతున్న వాస్తవం.

పౌష్టికాహార లేమివల్ల ఏం జరుగుతుంది?

తగిన పౌష్టికాహారం అందకపోతే శారీరక బలహీనతలు చోటుచేసుకుంటాయన్నదే చాలామందికి తెలుసు. వాస్తవానికి అది ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితిని మరింత దిగజారుస్తుందని, తద్వారా ఆహారలభ్యతారేటు ఇంకా పడిపోతుందనేది గుర్తించాల్సిన అంశం. అంటే చక్రభ్రమణంలా ఉపాధిఅవకాశాల

హరించుకుపోతున్న ఆహార భద్రత

బృందాకరత్

ఆహార ప్రజాపంపిణీ విభాగం ఇటీవల ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ కమిటీకి అందచేసిన పత్రంలో ఎనిమిది సిఫార్సులు ఉన్నాయి. అవి రాష్ట్రాలకు గోధుమల కేటాయింపు తగ్గింపు, గోధుమలకు బదులుగా ముతక ధాన్యాన్ని ఇవ్వడం, సంపూర్ణ రోజగార్ యోజన పథకంలో (ఎన్‌జిఆర్‌వై) వేతనాల చెల్లింపులో భాగంగా ఆహార ధాన్యాలను ఇచ్చే పద్ధతిని విరమించడం, కరువు ప్రాంతాలకు చేసే కేటాయింపులను తగ్గించడం, ప్రజాపంపిణీ వ్యవస్థద్వారా ఏపిఎల్ (దారిద్ర్యరేఖకు ఎగువ), బిపిఎల్ (దారిద్ర్య రేఖకు దిగువ) కార్డులు ఉన్నవారికి ఇచ్చే ఆహార ధాన్యాల ధరల హెచ్చింపు, ఏపిఎల్, బిపిఎల్ కార్డులకు ఇచ్చే ఆహార ధాన్యాలను 5 కిలోలకు తగ్గించటం, బహిరంగ మార్కెట్‌లో గోధుమల అమ్మకాన్ని నిలిపివేయటం.

రోజ్‌గార్ పథకం క్రింద గతంలో 5 కిలోల గోధుమలు ఇవ్వగా ఇప్పుడు 3 కిలోలు మాత్రమే ఇస్తున్నారు. నిజానికి ఈ పథకం కోసం వంపవలసిన గోధుమలను నిలిపి వేసినట్లు రాష్ట్రాలు ఫిర్యాదు చేస్తున్నాయి. ఏదియేమైనా గోధుమలను దిగుమతి చేసుకోవలసిన ప్రస్తుత దుస్థితికి ప్రధానంగా నాలుగు కారణాలు ఉన్నాయి. నయా ఉదారవాద విధానాల ఫలితమిది.

(1) వాణిజ్య పంటల ఎగుమతికి ప్రాధాన్యతనిచ్చే నూతన వ్యవసాయ విధానం కారణంగా గోధుమ దిగుబడి తగ్గింది. జనాభా పెరుగుదల రేటుకన్నా ఆహార ధాన్యాల పెరుగుదల రేటు తక్కువగా ఉన్నది. గోధుమ పండే పంజాబు, హర్యానా, పశ్చిమ యు.పీలలో భూసారం తగ్గిపోయింది. కనుక పంట మార్పిడి జరగవలసి ఉంది. అయితే గోధుమ పంటకు ప్రత్యామ్నాయ భూమిని చూడకుండా పంటమార్పిడి చేపడితే చాలా నష్టం కలుగుతుంది.

(2) ఏయేటికాయేడు గోధుమ సేకరణ తగ్గుతున్నది. ఇప్పటి సంక్షోభానికి ఇది మరొక కారణం. రైతులకు గిట్టుబాటు ధర రావాలన్న పేరుతో ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే గోధుమ మార్కెట్‌లోకి ప్రైవేటు వ్యాపారస్తులను అనుమతిస్తున్నది. ప్రైవేటు వ్యాపారులు మార్కెట్ ఫీజును చెల్లించటం లేదు. గత ఏప్రిల్‌లో కార్గిల్, రిలయన్స్, ఐటిసి, చివరకు ఆస్ట్రేలియన్ కంపెనీ సైతం గ్రామాలలోకి వెళ్ళి గోధుమలు కొనుగోలు చేశాయి. ఈ కంపెనీల కొనుగోళ్ళు అయిపోయిన తరువాత ప్రభుత్వం రంగంలోకి దిగి రూ.50ల 'బోనస్' ప్రకటించింది. ఇదే సమయంలో వ్యాపారులు ధరలు పెంచి అమ్మడంతో కొనుగోలుదారులు నష్టపోయారు.

(3) ఒక పథకం ప్రకారం ఎఫ్‌సిఐని ప్రభుత్వం బలహీనపరచింది. పనికి ఆహార పథకం, రోజగార్ యోజన వంటివాటికి ఎఫ్‌సిఐ పెద్దమొత్తాలలో ధాన్యాన్ని సరఫరా చేయవలసివుంది. ఎఫ్‌సిఐని కుదించివేయటంతో మార్కెట్‌లో జోక్యం చేసుకునే ప్రభుత్వ శక్తికూడా సన్నగిల్లి పోయింది. ఎఫ్‌సిఐని కుదించటమంటే ఆహార భద్రతను కుదించటమే అవుతుంది. కేటాయింపులను తగ్గించటంవల్ల 4.83 లక్షల చౌక దుకాణాల భవిష్యత్ అగమ్యగోచరంగా తయారయింది. ఏయేటికాయేడు అమ్మకాలు తగ్గిపోతున్నాయి. చాలా దుకాణాలు నష్టాలలో నడుస్తున్నాయి.

(4) ప్రజాపంపిణీ వ్యవస్థ లక్ష్యాలు ఏమాత్రం నెరవేరలేదు. పేదలను గుర్తించే విధానం లోపభూయిష్టంగా వుంది.

వేతనాలలో కొంత భాగాన్ని ధాన్యం రూపంలో చెల్లించే ప్రభుత్వ ఉపాధి పథకం ఆహార భద్రతకు ఉపకరించగలదు. అయితే దీనికి అవసరమైనన్ని ధాన్యాన్ని కేటాయించటం లేదు. శ్రామికులకు నిజవేతనాలు తగ్గుతున్నాయి. గోధుమ తదితర ఆహారధాన్యాల ధరలు పెరిగి పోవటంతో ఈ పరిస్థితి ఎదురవుతోంది. ఈనాడు కావలసింది ధాన్య సేకరణను, పంపిణీ వ్యవస్థను మెరుగుపరచటం. అంతేకాని వాటిని ధ్వంసం చేయటం కాదు.

ఆహారం	కాలరీలు
కేక్	200
చాక్‌లెట్	155
చూయింగ్‌గమ్	27
బర్గర్	330
కోకాకోలా	155
12 అంగుళాల పిజ్జా	1000
ఐస్‌క్రీమ్	150
ప్యూర్ సోడా	0
శాండ్‌విచ్	210
చికెన్ బిర్యానీ	440
బీఫ్ రోస్ట్	810
పేస్ట్రీస్	280
బేల్‌పురి	360
పావ్‌బాజి	240
చిప్స్	360
కార్న్‌ఫ్లేక్స్	460

ఫాస్ట్‌ఫుడ్ ప్రత్యామ్నాయం కాదు..



దేశంలో అత్యధికులు ఎదుర్కొంటున్న పౌష్టికాహార సమస్యకు అతికొద్దిమందికి మాత్రమే అవకాశమున్న ఫాస్ట్‌ఫుడ్ సంస్కృతే విరుగుడు అన్నట్లు సాగుతున్న బహుళజాతి సంస్థల ప్రచారం మాదిరిగానే మన పాలకులు, యువకుల్లో అత్యధికులు అదే అపోహల్లో జీవిస్తున్నారు. వాస్తవానికి పిజ్జా, బర్గర్, కేకులు, పేస్ట్రీలు,కోక్, శాండ్‌విచ్ ఇతర జంక్‌ఫుడ్‌లలో పోషక పదార్థాలేవీ లేకపోగా, స్థూలకాయం, ఎసిడిటీ లాంటి ఆరోగ్య వైపరీత్యాలకూ దారితీస్తాయని వారు హెచ్చరిస్తున్నారు. వాటితోపాటు భారతీయ వంటలైన భేల్‌పురీ, పావ్‌భాజీలు కూడా అంతే నష్టాన్ని కలిగిస్తాయి. గర్భిణులకు ఇవీ మరీ ప్రమాదకరం. పేదవాళ్లు స్థూలకాయంతో బాధపడే ఏకైక దేశం 'అమెరికా'. ఎందుకంటే అక్కడ చేతిలో రెండు డాలర్లు పడగానే ఆ సాయంత్రానికి ఏఫాస్ట్‌ఫుడ్ సెంటరులో గడిపేస్తున్నారట. ఫలితంగా జంక్‌ఫుడ్ బారినపడి స్థూలకాయాన్ని కొనితెచ్చుకుంటున్నారని తాజా వార్తల సారాంశం. సాధారణంగా ఈ తరహా పదార్థాల వల్ల మనిషి శరీరానికి అవసరమైన కాలరీలు దొరుకుతాయేమో కానీ, పోషకపదార్థాలు లభ్యం కావు. దానికి తోడు తగిన వ్యాయామం లేకపోతే రోగాలు మూటకట్టు కున్నట్లే. కోక్ సంగతే తీసుకోండి. సాధారణ 250ఎంఎల్ బాటిల్ ద్వారా 155 కాలరీల శక్తి లభిస్తుంది. కానీ అది ఖర్చుచేస్తేనే ఒంటబట్టేది. పైగా కోక్‌లాంటివాటిల్లో పిహెచ్ శాతం మూడు కన్నాతక్కువ. ఇది మరీ ప్రమాదకరం.

తగ్గుదల–పేదరికం–పౌష్టికాహారలేమి అనులోమంగా ఉంటాయి.

మనదేశంలోని కొన్ని ప్రాంతాల్లో మహిళలు, పిల్లల్లో పౌష్టికాహారలేమి అత్యధికంగా కనిపిస్తోంది. మిగతా వయసుల వారికన్నా, ఐదేళ్లలోపున్న వారికి న్యూట్రిషన్ అవసరాలు ఎక్కువగా ఉంటాయి. అయితే భారత్‌లాంటి మూడో ప్రపంచ దేశాల్లో అందరికన్నా తక్కువ ఆహారం అందుతోంది ఆ వయసు పిల్లలకే. మహిళల కన్నా పురుషులకే పౌష్టికాహారం ఎక్కువగా దొరుకుతుండటం గమనార్హం. సరిపడ ఆహారం దొరక్కపోవడం, అనారోగ్యం, పిల్లల పెంపకపు బాధ్యతలనుంచి తల్లిదండ్రులు తప్పుకోవడం వంటివి ఇందుకు ప్రధాన కారణాలు. తీరా దానిబారిన పడ్డాక ఎలా బయటపడాలో తెలీని సందిగ్ధావస్థలో ఉన్న గ్రామీణ జనం చైతన్యరహితులవడం కూడా మరో కారణం. ఫలితంగా మహిళల్లో మాతృత్వ మరణాల రేటు గణనీయంగా పెరిగిపోతోంది. ఐదేళ్ల చిన్నారుల్లో పౌష్టికారహా లేమి కారణంగా చిన్నపిల్లల్లో శారీరక, మానసిక స్థితిలో ఎదుగుదల లోపిస్తోంది. ఒక అమెరికన్ మహిళ కన్నా భారతీయ మహిళ 25శాతం తక్కువ బరువును కలిగి ఉంటుంది. ఇది కేవలం ఆహారస్వీకరణ కారణంగా ఏర్పడ్డ తేడా మాత్రమే. 1960లోనే భారత ప్రభుత్వం ఆహారభద్రత అవసరాన్ని గుర్తించింది. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సరుకులు సామాన్యునికి చేరేలా చర్యలు తీసుకుంది. కానీ చౌకధరల దుకాణ వ్యవస్థ నిర్వహణాలోపాల వల్ల కొందరికే పరిమితమైంది. తరువాత ప్రవేశించిన దళారీ వ్యవస్థ లబ్ధిదారుల ఎంపిక దగ్గరి నుంచి సరుకుల పంపిణీ, బ్లాక్‌మార్కెటింగ్‌లతో బలంగా వేళ్లూనుకుంది.

పౌష్టికాహారం, ఆహారభద్రతపై ఎన్ఐఆర్‌డి కీలక సూచనలు

2004 జూన్ 23, 24 తేదీల్లో హైదరాబాద్‌లో జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన జాతీయసెమినార్ ఆహారభద్రత, పౌష్టికాహారకల్పనకు సంబంధించి ప్రభుత్వానికి కొన్ని సూచనలు చేసింది. అయితే అవి పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదు. ఎన్ఐఆర్‌డి ప్రతిపాదనల్లో ముఖ్యమైనవి..

(1) వర్షాభావ, కరువు ప్రాంతాల్లో ఆహార భద్రతకు సంబంధించి తీసుకునే చర్యల్లో పంచాయతీరాజ్ సంస్థలను భాగస్వాములను చేయాలి. జనాభా పెరుగుదలను కుటుంబనియంత్రణ ద్వారా నిరోధించాలి.

(2) శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పిల్లల, మహిళల ఆహారఅవసరాలకోసం మరింత మెరుగుపరచాలి. పంచాయతీలు, స్వయంసహాయక సంఘాల పరిధిలో అంగన్‌వాడీ వర్కర్ల ద్వారా పౌష్టికాహారలేమి కారణంగా తలెత్తే ఆరోగ్యసమస్యలకు చికిత్స జరిపించాలి.

(3) వలస కూలీలకు, అక్కడికక్కడే తాత్కాలిక రేషన్‌కార్డు సౌకర్యం కల్పించడం ద్వారా జాతీయ ప్రజాపంపిణీ వ్యవస్థను అర్హులైన అందరికీ అందుబాటులోకి తేవాలి. ప్రజాపంపిణీ వ్యవస్థను వికేంద్రీకరించి, పప్పుధాన్యాలు కూడా సరఫరా చేయాలి. నెలవారీ రేషన్ కోటాను నాలుగు విడతలుగా లబ్ధిదారులకు పంపిణీ చేయాలి

(4) ధాన్యం సేకరణ, స్టోరేజీ, చౌకధరల దుకాణాల ద్వారా వాటి పంపిణీ.. ఇలా అన్ని దశల్లోనూ ఆహార గింజల క్వాలిటీని పరిశీలించాలి. పిడిఎస్‌లో పారదర్శకతను చూపేందుకు గ్రామపంచాయతీ స్థాయిలో ఆహారసలహాసంఘాలు వేయాలి. సరుకులు పక్కదారి పట్టకుండా విజిలెన్స్ కమిటీలను నియమించాలి.

(5) జిల్లాలోని ఆహార అవసరాలు, కరువు, ఆకలి అంశాలపై బ్లాక్ స్థాయిలో కలెక్టర్, బిడివోలతో నెలవారీగా సమీక్షించాలి. ఆహారభద్రతా సంఘాలను వివిధ స్థాయిలో నియమించాలి.

(6) సాంప్రదాయక వ్యవసాయక విధానాలను ప్రోత్సహించి, చిన్న, సన్నకారు రైతులకు పెట్టుబడి అవసరాలను ప్రభుత్వం తీర్చాలి.

(7) కాంట్రాక్టు వ్యవసాయ పద్ధతి కన్నా, రైతులు, స్వయం సహాయక బృందాలతో కలిసి సహకార సేద్యపు పద్ధతి ఉపయుక్తం. ఆ దిశగా ప్రభుత్వం వారిని ప్రోత్సహించాలి.

(8) కరువు ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకాలను సమర్థవంతంగా అమలు జరపాలి. ప్రతీ వయోజనునికి కనీసం వంద రోజుల పని కల్పించాలి.

(9) మధ్యాహ్నభోజన పథకం, అంత్యోదయ అన్నయోజన, అన్నపూర్ణ వంటి పథకాలు నిజమైన లబ్ధిదారులకే చేరేలా చర్యలు తీసుకోవాలి. ఆహారభద్రతకు సంబంధించిన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల పథకాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు చేర్చాలి. వాటిపై ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలి.

(10) కనీస వేతనాలు అమలు చేయాలి. మొత్తం వేతనంలో నాలుగోవంతుకు తగ్గకుండా నగదు రూపంలో అందజేయాలి. వారాంతపు సంతలకు ముందురోజు వేతన చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలి.

అంకెలు చెబుతున్న వాస్తవాలు

వ్యవసాయ రంగం పరిస్థితి సంస్కరణల ఫలితంగా దిగజారింది. ఉదాహరణకు సంస్కరణల ముందు 5.3శాతంగా ఉన్న జిడిపి పెరుగుదల రేటు సంస్కరణల తర్వాత 5.89 శాతానికి పెరగగా, అందులో వ్యవసాయ రంగం వాటా అదేకాలంలో 3.24శాతం నుంచి 2.6శాతానికి తగ్గింది. ఈ గణాంకాల్లో పశుగణాభివృద్ధి లెక్కలు కూడా కలిసి ఉన్నాయి. వాటిని మినహాయించి చూస్తే పరిస్థితి మరింత దారుణంగా కనిపిస్తుంది. ఈ తగ్గుదల కారణంగా 1981-2001 మధ్య వ్యవసాయాధార శ్రమజీవుల శాతం 68నుంచి 60శాతానికి పడిపోయింది. జనాభా పెరుగుదల శాతం కన్నా ఆహార ధాన్యాల ఉత్పత్తి శాతం తక్కువగా ఉంది.

ప్రజల ఆరోగ్య సంరక్షణకుగాను ఆ దేశ జాతీయాదాయంలో 5శాతాన్ని వెచ్చించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏనాడో సిఫార్సు చేసినప్పటికీ, మనం మాత్రం 0.9శాతం మాత్రమే ఖర్చు చేస్తున్నాం. మనకన్నా వెనుకబడిన బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లు ఇంతకన్నా ఎక్కువే ఖర్చుచేస్తున్నాయి. ఆరోగ్యం కోసం మనదేశంలో పెడుతున్న మొత్తం ఖర్చులో 20శాతం మాత్రమే ప్రభుత్వం భరిస్తోంది. సంపన్నదేశాలు 60శాతం వరకూ భరిస్తున్నాయి.

భారతదేశంలో గ్రామీణ వ్యవసాయ కుటుంబాల సగటు నెలసరి ఆదాయం 2003లో 503 రూపాయలు. ఇది గ్రామీణ దారిద్ర్యరేఖ కన్నా 75 రూపాయలు మాత్రమే ఎక్కువ. నిజానికి చాలా కుటుంబాలు ఆ రేఖకు దిగువనే ఉండిపోయాయి. కేరళ, పంజాబ్, ఒరిస్సా, జార్ఖండ్, చత్తీస్‌ఘర్,బీహార్ రాష్ట్రాలను మినహాయిస్తే, మిగిలిన రాష్ట్రాల సగటు కేవలం 225 రూపాయలు మాత్రమే. ఈ నెలవారీ సగటు జీతంతో ఒక కుటుంబం ఎలా జీవిస్తున్నదే ఆశ్చర్యకరమైన అంశం. ఈ సగటులో 55శాతం ఆహారంపైనే ఖర్చవుతోంది. అంటే నెలకు ఆ పరిధిలోని ఒక కుటుంబ భోజన ఖర్చు 150 రూపాయల లోపే.

పౌష్టికాహార సమస్యతో బాధపడుతున్నవారిలో అత్యధికులు మహిళలు, పిల్లలేనని గుర్తించిన ప్రభుత్వం ఐసిడిఎస్‌లు నెలకొల్పడం ద్వారా అవసరమైన చర్యలను చేపట్టింది. ఇటీవల బడి ఈడు పిల్లలకు పౌష్టికాహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి కేంద్రం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే పథకాల ప్రారంభంలో ఉన్న శ్రద్ధ అమల్లో సన్నగిల్లేసరికి లక్ష్యాలను చేరుకోకుండా చతికిలపడ్డాయి. గ్రామీణ ప్రజల సగటు జీవనప్రమాణ స్థాయిని పెంచడానికి ప్రవేశపెట్టిన ఉపాధి పథకాలు కూడా నామమాత్రంగా కూడా పనిచేయలేకపోయాయి.

'మరణాల సంఖ్యను సగానికి, గర్భధారణరేటును 2/5వ వంతు తగ్గించడం ద్వారా గడిచిన 40ఏళ్లలో మాల్‌న్యూట్రిషన్ రేటు ఐదోవంతు మాత్రమే తగ్గించగలిగాం. ప్రభుత్వాలు ఇదే పద్ధతిని అనుసరిస్తే.. పౌష్టికాహారలేమిని తొలగించేందుకు కనీసం రెండు శతాబ్దాలు పడుతుంది. ప్రమాదకరస్థాయి నుంచి బయటపడేసే చర్యల్ని ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చేపడితేకానీ మోక్షముండదు' అని భారత్‌లోని ఆహారస్థితిగతులపై పరిశోధన చేస్తోన్న ఆరోగ్యసంస్థ ప్రతినిధి ఆంథోని మీషమ్ చెబుతున్నారు. ✦

అతి అనర్థదాయకమే..

పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం మంచిదే కానీ, పౌష్టికాహారం ఎక్కువ తీసుకోవడం కూడా ఒంటికి చేటు తెస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. నిర్దేశిత మోతాదును మరిచి అతిగా ఆహారం తీసుకుంటే పౌష్టికాహారం కూడా అనారోగ్యం పాలుచేస్తుందని అంటున్నారు. ఒంట్లో కొలెస్టరాల్ పెరిగి స్థూలకాయం బారిన పడాల్సిందే. పాలు ఎక్కువగా తాగేవారు, మాంసాహారం ఎక్కువగా తీసుకునేవాళ్లు గుండె సంబంధిత వ్యాధులకూ గురికావచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు. జంక్‌ఫుడ్ తినేవాళ్లు ఎక్కువ కాలరీల శక్తిని తీసుకుంటారు. దీన్ని ఖర్చుచేయాలంటే తగిన వ్యాయామం తప్పనిసరి. అలా చేయలేని పక్షంలో శరీరంలో కొవ్వు పేరుకుపోతుంది. రెండోదశలో ఊబకాయం రావడం, బరువు పెరిగిపోవడం జరుగుతుంది. వీటి ఫలితంగా రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయి పెరిగిపోతుంది. ఇది మూడోదశ. నాలుగోదశలో అథ్రోక్లెరోసిస్ ఇతర హృదయసంబంధ వ్యాధులు చుట్టుముడతాయి. ఇప్పటికే గుండె జబ్బులతో బాధపడేవారు కొలెస్ట్రాల్ రహిత ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి. కొలెస్ట్రరాల్ తగ్గుదలకు మందులేవీ లేవు. కొన్ని రకాల డ్రగ్స్ ఉన్నా, అవి క్యాన్సర్, గుండె సంబంధ, మానసిక వ్యాధులను కొనితెస్తాయి. కాబట్టి మిత ఆహారం, తగిన వ్యాయామమే కొలెస్ట్రరాల్ నివారణకు మందు.

ఇలా ట్రై చేయండి..

- దంపుడు బియ్యం, పెసరపప్పు, ఎండు ఖర్జూరాలు, పెరుగు, బాదం, మజ్జిగ సమృద్ధిగా తీసుకోవాలి
- ఉడకబెట్టిన చేపలు గుండెకు, నాడీవ్యవస్థకు మేలు చేస్తాయి. మొలకెత్తిన గింజలు, మెంతికూర, తోటకూర, కరివేపాకు, ముల్లంగి శ్రేష్ఠం. ఉలవచారు మంచిది.
- వేపుళ్లు, ఇతర నూనె పదార్థాలు.. ఉప్పు, పులుపు, కారం తగ్గించాలి.
- కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తీసుకోవాలి.
- ప్రతీరోజూ వంద గ్రాముల వరకు పళ్లు తీసుకోవాలి. ప్రొటీన్లు, పీచు, పిండిపదార్థాలు, కాల్షియం, ఫాస్ఫరస్, ఇనుము, సోడియం, పొటాషియం, మాంగనీస్, కెరోటిన్, అస్కార్బిన్‌ఆమ్లం, విటమిన్-సి, నీరు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరానికి సంపూర్ణ ఆరోగ్యాన్ని సమకూరుస్తాయి.
- ఆకుకూరల్లో ఎంతో అవసరమైన పోషక విలువలుంటాయి. ఇవి కొలెస్టరాల్, రక్తహీనతలను నిరోధిస్తాయి కూడా.
- ప్రతిరోజూ పాలు, వారానికి మూడుసార్లు కోడిగుడ్డు, ఒకసారి కొబ్బరిబోండాం తీసుకుంటే ఆరోగ్యానికి ఏ ఢోకా ఉండదని నిపుణులు చెబుతున్నారు.

కథ

తెలకపల్లి రవి

భవనం

అతను ఒక్కసారి లేచి భవనం కేసి చూశాడు. వడివడిగా అడుగులేస్తూ అక్కడినుంచి కదిలాడు. "అతనింకెప్పుడూ ఇక్కడకు రాడు" అన్నాడు తాత మనవడితో ఆరోజు రాత్రి.

సిటీబస్సు రోజూలాగే ఆగింది. ఎప్పట్లానే అతనూ దిగాడు. దిగిన బస్సుకేసి ఓసారి చూశాడు. ఆ చూపులో ఏదో బరువు. బస్సు వెళ్లేదాకా ఆగి కదిలాడు. నిజానికి అతనలా ఆగవలసిన అవసరం ఏమీలేదు. అయినా రోజూ అలానే చేస్తుంటాడు.

అతని అడుగులు అలవాటైనవైపే పడుతున్నాయి. ఆ వీధి మూలన తను కూర్చునే స్థలంకేసి కదిలాడు. అయితే అక్కడేదో కదలిక. ట్రాక్టర్లు, బుల్‌డోజర్లు, ఎవరో ఆ స్థలాన్ని పరిశీలిస్తున్నారు. అంతా సందడి. ఇక్కడా ప్రశాంతత పోయిందన్నమాట. తనలో తను అనుకున్నాడు.

అయితే అక్కడంత సందడి మధ్యనా అదృష్టవశాత్తూ ఒకపక్కన కూర్చోడానికి అనుకూలంగా ఓ చెట్టుంది. హమ్మయ్య అనుకుంటూ అటు నడిచాడు. అక్కడున్న కొద్దిపాటి ఇసుకలో కూలబడ్డాడు. బ్యాగులోంచి ఏదో పుస్తకం తీశాడు. దాన్ని ఒక పేజీ తిప్పాడు. మళ్లీ బ్యాగులోంచి మంచినీళ్లసీసా తీశాడు. నీళ్లు తాగుతూ అదంతా మరోసారి పరిశీలించాడు.

మరోసారి మూసిన పుస్తకం తీసుకుని తను చదవాల్సిన పేజీ తెరిచాడు. అయితే ఎక్కువసేపు చదవలేకపోయాడు. శూన్యంలోకి చూస్తూ ఏదో ఆలోచించాడు.

ఆ పుస్తకం లోపల పెట్టి ఇంకోటితీశాడు. పెన్సిల్‌తో గీతలుగీస్తూ దాన్ని కొద్దిగా చదివి లోపలపెట్టేశాడు.

ఈరోజు కూడా చదువు సాగడంలేదు. ఎలా సాగుతుంది? అన్ని వైపులనుంచి సమస్యలు చుట్టుముట్టి ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే...?

జేబులోంచి అన్నయ్య రాసిన ఉత్తరం తీసి మరోసారి చదువుకున్నాడు. 'నువ్వేదో ఒక దారి చూసుకోకపోతే ఎంతోకాలం సహాయం చేయలే'నని రాశాడు. 'అందరూ అంతే. అన్నయ్య తల్చుకుంటే తనలాటివాళ్ళను వందమందిని పోషించగలడు. కానీ, ఎప్పుడూ ఇలాంటి ఉత్తరాలే రాస్తుంటాడు. అమ్మానాన్నలను తనదగ్గర పెట్టుకోవడమే గొప్పయినట్టు మాట్లాడుతుంటాడు' అనుకునేసరికి అతనికి దుఃఖం పొర్లుకొచ్చింది. బాధగా కళ్ళు తుడుచుకుని మళ్లీ పుస్తకం తీసి చదవబోయాడు కాని ఫలితంలేక లేచాడు.

ఇప్పటివరకూ కనీసం ఇక్కడైనా ప్రశాంతంగా గడిపేవాడు. కాని ఇక్కడా ఏదో కట్టడం మొదలెట్టారు. ఇంక ఈ కాంక్రీటు అరణ్యంలో మరో చోటు వెతుక్కోవడం ఎంత కష్టమో తనకు తెలుసు. మరోసారి నిట్టూర్చి బయిలుదేరాడు.

❂ ❂ ❂

బస్సు ఆగింది. అతను దిగాడు. బస్సుకేసి చూసి, అది వెళ్లేదాకా ఆగి ఆ పిమ్మట బయిలుదేరాడు. తను కూర్చునే స్థలం వుంటుందో లేదోనన్న భయం అతనిలో స్పష్టంగా కనిపిస్తోంది. నిజంగానే అతను వెళ్లేసరికి అక్కడ చుట్టూ కంచె కట్టి వున్నారు.

లోపలేదో పని జరుగుతోంది, కంచెకు చాలా దూరంలో. ఆ కంచెకు ఒక గేటు కూడా వుంది. ఏం చేయడమా అని ఆలోచిస్తుండగానే లోపలి నుంచి ఒక ముసలతను "ఏం బాబూ, ఈరోజు ఆలస్యమైందే?" అని పలకరించాడు.

అతనికి చాలా ఆశ్చర్యమేసింది. తనగురించి అతనికెలా తెలుసు? అందుకే జవాబు చెప్పడానికి కాసేపు తడబడ్డాడు. మళ్లీ తాతే మౌనాన్ని ఛేదిస్తూ "రోజూ నిన్ను చూస్తుంటాగద బాబూ... సిటీ బస్సులో వచ్చి చెట్టుకింద కూచుని చదువుకుంటావు, భోజనం టైముకు వెళ్లిపోతావు... ఇప్పుడిదంతా కడుతున్నారే ఎట్లా అని ఆలోచిస్తున్నావ్ కూదూ?"

అరే, ఈ తాత తన మనసంతా చదివేసినవాడిలా ఎలా చెబుతున్నాడు? అతని ఆశ్చర్యం ఇంకా పెరిగింది.

"ఫర్వాలేదు బాబూ, ఇప్పుడిప్పుడే మీకేం ఇబ్బంది లేదు. రోజూ వచ్చి చదువుకోవచ్చు. నేనీడనే కాపలా వుంటా. నాకూ తోడున్నట్టుంటుంది"

"థాంక్స్ తాతా"

"అవన్నీ మీ చదువుకున్నోళ్ళ మాటలు. నాకెందుకులే బాబూ, నేనేమన్నా ఇస్తున్నానా? నీ పాటికి నువ్వు చదువుకుంటుంటావు అంతేకద"

అతను తల పంకిస్తూ తన స్థలం కేసి

నడిచాడు.

ఆరోజు అతను రోజూకంటే ఆలస్యంగా వచ్చాడు. మరీ దిగులుగా వున్నాడు. తాత దూరంగా పునాదులు తవ్విస్తున్నాడు. ఇతన్ని చూశాడు గాని దగ్గరకు రాలేదు. రావడానికి చాలా టైము పట్టింది.

"ఏం బాబూ అలా వున్నావు?" అనడిగాడు తాత వచ్చీరాగానే.

అతను తన కష్టాలు చెప్పాడు. అన్నీ విని 'అయ్యో' అని "ఫర్వాలేదులే బాబూ చూద్దాం, నేనెల్లి పునాదులు తవ్వడం ఎంతవరకొచ్చిందో చూసొస్తా" అంటూ లేచాడు. 'ఈ ముసలాడికి కూడా నా గురించి వినే ఓపిక లేదు. ఎవర్నెవరు పట్టించుకుంటారు లే' అనుకుని మళ్లీ పుస్తకం తిరగేయడంలో పడ్డాడు. సాగని చదువును తిట్టుకుంటూ కాసేపయ్యాక లేచి వెళ్లిపోయాడు.

పునాదుల తవ్వకం చూడ్డానికి వెళ్లినా తాత ఇదంతా గమనిస్తూనే వున్నాడు.

❂ ❂ ❂

"ఏం తాతా వంట్లో బాగా లేదా?" దగ్గుతుంటే అడిగాతడు.

"ఔను బాబూ, దగ్గు ఎక్కువైంది. స్లాబ్ వేసేప్పుడు దుమ్ము అదీ వస్తుంది. నాకేమో దుమ్ము పడదు. అయినా మనలాణ్ణి, నా సంగతికేంగానీ నీగురించి చెప్పు.. ఏమైంది? అన్నయ్య నువ్వడిగిన దానికి ఒప్పుకున్నాడా?"

ఆ మాట వినగానే అతని మొహంలో ఎక్కడలేని కోపం. "ఎందుకొప్పుకుంటాడు? నాకు ఇంకేమాత్రం సహాయం చేయలేడట. ఏదైనా ఉద్యోగంలో చేరమంటాడు. చిన్న వ్యాపారం చేస్తానంటే అప్పు ఇచ్చేవాళ్లను చూపిస్తాడట.. ఇలాటి కబుర్లు ఎవరికి కావాలి చెప్పు?"

తాత ఏదో అనబోయాడు. కాని అతని ముఖకవళికలు చూసి ఆగిపోయాడు.

"కానీ బాబూ, చూద్దాం.. నేను రెండో ఫ్లోర్లో నీళ్లు సరిగా పోస్తున్నారో లేదో చూసొస్తాను.. అన్నట్టు బాబూ, మాకో మేస్త్రీ కావాలి. కాస్త చదువుకున్న వాడైతేచాలు. నెలకు రెండువేలిస్తారు. తిండి, మకాం కూడా ఇక్కడే. ఎవరైనా తెలిసిన వాళ్లుంటే చెప్పు"

అతనికి ఆ మాటల పట్ల ఆసక్తి లేదని తాతకు అర్థమైంది.

❂ ❂ ❂

అతను బస్సు దిగి మరింత బరువుగా నడిచి వచ్చాడు. అటూ ఇటూ కూడా చూడకుండా తలనేలకేసి కూలబడ్డాడు. సుదీర్ఘంగా ఆలోచిస్తూ జుట్టు పీక్కుంటూ కళ్ళు నులుముకుంటూ ఏదేదో చేశాడు. పుస్తకం తెరిచి మూసి తెరిచి మూసి చాలా సమయం గడిపాడు.

నాల్గవ అంతస్తులో తలుపులు పెట్టడం కోసం బాగా చప్పుడవుతున్నా పట్టించుకోనంతగా ఆలోచనల్లో మునిగిపోయాడు. మధ్యమధ్య వాచీకేసి చూసుకుంటున్నాడు. చూపు ఆనకపోయినా తాత పైనుంచి ఇదంతా చూడటానికి ప్రయత్నం చేస్తున్నాడు.

ఇంతలోనే ఒక కుర్రాడు అతన్ని సమీపించాడు. ఆ కుర్రాడు దగ్గరకు రాగానే అతను అనుమానంగా చూశాడు.

'నేను ఆ తాత మనవణ్ణండి. వూర్నుంచి వచ్చాను. ముసలాడు మీ గురించి చెబుతుంటాడు.'

'అలాగా?!' అన్నా డతను. ఆ కుర్రాడితో మాట్లాడాలని అతనేమీ అనుకోవడంలేదని తెలుస్తూనే వుంది.

'రేపటి నుంచి ఇక్కడ ఔట్ హౌస్ మొదలు పెడతారండీ.." అన్నాడు ఆ అబ్బాయి మెల్లగా.

"ఆహా" అన్నాడు. ఇక్కణ్ణించి కూడా తనను తరిమేస్తున్నారిక అనుకుని తల పంకించాడు.

"కాని మీకేం ఇబ్బంది లేకుండా తాత ఏర్పాటు చేశాడండీ. ఆ పైన మూడో అంతస్తులో ఒక రూము తొందరగా చేయించాడు. మీరు దాంట్లో కూచుని చదువు కోవచ్చు. మెయిన్ బిల్డింగ్ చాలావరకూ పూర్తయింది కనక మీకు పెద్ద డిస్టర్బెన్స్ వుండదు.

డిస్టర్బెన్స్ అని ఇంగ్లీషు పదం వాడుతున్నాడు.. చదువుకున్నాడులా వుంది అనుకున్నాడు.

''నేను పరీక్షలు కట్టానండీ. ఓపెన్ యూనివర్సిటీలో. మీరు ఏమైనా కాస్త చెబుతారేమోనని తాత అడమన్నాడు"

అతని గుండెల్లో రాయి పడింది. 'ఆ కుర్రాడు చదివేదేమిటో తెలీదు. తను చెప్పగలడో లేదో.. ఇవన్నీ తనెక్కడ తగిలించుకోగలుగుతాడు? తనకే ఒక దిక్కూ దివాణం లేదు'

''నేనేం చెబుతాను?'' అని మాత్రం అనగలిగాడు.

"ఫర్వాలేదండీ, మీకు ఇష్టమైతేనే.." ఆ కుర్రాడు వినయంగా అన్నాడు.

'హమ్మయ్య, బతికిపోయాను' అనుకున్నాడతను. కాని ఇంతలోనే ఆ అబ్బాయి "మీరేమైనా చేస్తున్నారా లేక చదువుతున్నారా అండీ?" అన్నాడు.

'ఎంత సులభంగా అడిగాడు! దానికి జవాబేం చెప్పగలడు తను? ఎన్నిసార్లని చెప్పాలి? చెబితే మాత్రం ఎవరర్థం చేసుకోగలరు?' అనుకుని "అవన్నీ మీ తాతయ్యకు తెలుసు. నీవు కొత్తగా వచ్చావు కదా" అంటూ బయలుదేరాడు.

❂ ❂ ❂

అతను బస్సు దిగాడు. అది వెళ్లేదాకా చూసి తన స్థలానికి బయలుదేరాడు. అక్కడ రోజూకన్నా సందడి పెరుగుతున్నది. తన ప్రశాంతతకు భంగం తప్పదనుకుంటూనే అటుగా వెళ్లాడు.

గేటు దగ్గరే కనిపించాడు తాత. నవ్వుతూ పలకరించాడు. ఏదో మాట్లాడబోయేంతలోనే స్కూటర్ ఒకటి లోపలినుంచి దూసుకొచ్చింది. దగ్గరకు రాగానే ఆగింది. కళ్లజోడు తీసి స్కూటర్‌పైనుంచి తాతను మాట్లాడించాడా కుర్రాడు.

"నే వెళ్తున్నా. పరీక్షలు రాసి అట్నుంచటే వెళ్తాను. ఇన్విటేషన్లు పూర్తయ్యాయేమో కనుక్కుని వస్తాను" అన్నాడు.

''ఇన్విటేషన్లేమిటి తాతా?'' ఆసక్తిగా అడిగాడతను. అతనుగా ఏదైనా అడగడం అదే

పుస్తకాలు కొనుక్కురమ్మని అస్తమానూ చెప్పి చెప్పి వాడికీ విసుగొచ్చిందట!

మొదటిసారి. తాతకు కొంచెం ఆనందం వేసింది.

"వచ్చేవారం ఈ బిల్డింగు ఓపెనింగ్ బాబూ.. అందరూ దానిగురించే హడావుడిగా వున్నారు"

"ఆహా.." అనేసి అతను కదలబోయాడు.

"బాబూ, ఏమనుకోకుంటే ఒక్కమాట.."

"చెప్పు తాతా.."

"ఇంకో రెండుమూడు రోజుల తర్వాత ఇక్కడకు రావడం కుదరదు బాబూ.. అంతా లీజుకు ఇచ్చేశారు. ఇప్పటివరకూ నేనే ఏదో సర్దిచెబుతూ వచ్చాను. ఇంక కష్టం"

"ఫర్వాలేదు తాతా. నేను ఇంకోచోటు ఏదైనా చూసుకుంటాను" అతని కంఠం కొంచెం బరువుగానే వుంది.

"కాని.."

అంతకంటే బరువుగా తాత కంఠం పలికింది. "ఇంకో చోటు చూసుకోవలసిందేనా బాబూ?!"

అతనొక్కసారిగా ఆశ్చర్యంలో మునిగిపోయాడు. ''అదేం తాతా, అలా అంటున్నావ్? ఈ లోకంలో మనం ఎవరికి కావాలి తాతా? నువ్వంటే మంచివాడివి కాబట్టి నా బాధ విన్నావు. సానుభూతి చూపించావు. అందరికీ ఏం పడుతుంది?"

"అంటున్నానని ఏమీ అనుకోవద్దు. లోకానికి నీవు పట్టలేదా? నీకు లోకం పట్టలేదా బాబూ?" తాత గొంతు కఠినంగా వుంది. అతనేం మాట్లాడకుండా చూస్తున్నాడు.

"ఈ స్థలం ఖాళీగా వున్నప్పటి నుంచి వస్తున్నావు. పునాదులు తవ్వి ఇన్ని అంతస్తుల భవనం లేచింది. నువ్వు మాత్రం నీ ఏడుపులోంచి బయటకు రావు. నిన్ను నేను చూశాను గాని నువ్వు నన్ను చూడలేదు. ఈ భవనం ఎలా పూర్తవుతుందో పట్టించుకోలేదు. ఇంత ముసలాడు దగ్గుతూ ఎలా పనిచేస్తున్నాడనీ చూడలేదు. నా పరిస్థితి గురించి ఒక్కసారైనా అడిగినపాపాన పోలేదు. పోనీ అని ఇక్కడ ఉద్యోగం వచ్చే అవకాశం చూపిస్తే ఉపయోగించుకోలేదు. నీ ముందే నా మనవడు అల్లుకుపోతున్నా అర్థం కాలేదు. ఇందులో నీకేమీ తప్పు కనిపించడం లేదా బాబూ?" తాత గొంతులో కోపం లేదు. బాధ ధ్వనిస్తోంది.

అతను ఒక్కసారి లేచి భవనం కేసి చూశాడు. వడివడిగా అడుగులేస్తూ అక్కడినుంచి కదిలాడు.

"అతనింకెప్పుడూ ఇక్కడకు రాడు" అన్నాడు తాత మనవడితో ఆరోజు రాత్రి. ✦

సెన్సాఫ్ కామన్ సెన్సు

రుక్మిణి

అనుభవసారం

'నేను ఈ ఖగోళ అనంత విశ్వాంతరాళంలోకి చూస్తున్నానంటే నాకన్నా ముందున్న మహానుభాల భుజాలమీద నిలబడే తొంగి చూస్తున్నాను'

ప్రతి వ్యక్తీ తన జీవితకాలంలో అంతో ఇంతో అనుభవాన్ని గడిస్తాడు. ఈ అనుభవాలకు కులం, మతం ఉండదు. చదువూ, డిగ్రీలతో పన్లేదు. అర్హతల్లా వయసు మాత్రమే. వయసు మళ్లినోళ్లు తమ కన్నా చిన్నవారిముందు తమ అనుభవాలను వినిపించడానికి తపనపడతారు. సహజంగా గుడ్డొచ్చి పిల్లను వెక్కిరించే బాపతు వారూ వుంటారు. అది అప్రస్తుతమనుకోండి.

సాధారణంగా ఉద్యోగస్థులైతే, తాము రిటైరయ్యాక కొత్తగా ఉద్యోగంలో చేరిన లేదా చదువుకుంటున్నవాళ్లను లంకించుకుంటారు. మామూలువాళ్లయితే తమ మనవళ్లనో, ఆ వయసుగలవాళ్లనో దొరకబుచ్చుకుంటారు. అనుభవాలు చాలా విలువైనవి. భావితరాలకవి మార్గదర్శకాలుగా ఉపయోగపడతాయి. అయితే అనుభవాలను వివరించే వ్యక్తి అనుసరించే విధానం, ఆ అనుభవాలను వివరిస్తున్న తీరు శ్రోతలమీద ఎక్కువ ప్రభావాన్ని చూపిస్తుంది. అంటే అనుభవాలు వింటున్న వ్యక్తి ఆ అంశాలవల్ల ఉత్తేజపడాలేగానీ అక్కణ్ణించి పారిపోదామనుకోకూడదు.

అనుభవాల్లో అతిశయోక్తులు జోడిస్తే అభాసుపాలయ్యే ప్రమాదముంది.

"అరేయ్... కలెక్టరు విజిట్ చేశాడ్రా. మనం కేర్‌చేయంగానీ.. మరీ కుర్చీలోనే నిద్దర్లోకి జారుకున్నాం గద. హ్హహ్హహ్హా... అట్లా గుమ్మంనుండే... వెనక్కి... గోబ్యాక్. కలెజా, దమ్ముండాల్రా...! ఉద్యోగం చెయ్యగానే నరిపోదు" ఇదొక రిటైర్డ్ ఉద్యోగి అనుభవం.

"ఒరోరి... గాదినం, ఏరుపారుతుందా... ధన్‌మని దుమికిన, ఇదిగో ఇంత (జబ్బలు చరిచి చేతులు మడిచాదు) ఇంతలావు బొబ్బై.... రామప్పనుండి వస్తోంది. ఒడేసి పట్టిన... పదికిలోల్ది, కావిలించుకుని ఈతమీద ఇవతల వడ్డుకు తెచ్చిన" ఇది ఒక ఆసామి మనవరాళ్ని కూర్చోబెట్టి చెప్పుకుంటున్న వింత అనుభవం. అన్నట్లు అనుభవాల్లో చర్విత చరణప్రమాదం ఉండకూడదు.

"అరే... నలభై ఏళ్ళ కిందట్నే జాబ్‌లో జాయినైన. మొదటి రోజూ..'' ఆయన ప్రారంభించగానే వింటున్న నలుగురు కుర్రాళ్లలో ముగ్గురు మటమటలాడుతూ లేచిపోయారు. మిగిలిన ఒకడు "ఆc... ఏముందీ? హెడ్మాస్టరు ఏదో అంటే చడామడా దులిపి బయటపడ్డాడు. తరువాత ఆయనగారే మమ్మల్ని బతిమాలారు. ఇప్పటికిది వందసార్లు చెప్పారు. అయినా మీకు విసుగు వుండకపోవచ్చు. కానీ వినే ఓపిక మాకు ఉండొద్దూ?!" అని అతను రుసరుసలాడుతూ లేచిపోయాడు. అదీ సంగతి. విన్న విషయాల్నే పదేపదే వినడానికి ఎవడూ సాహసం చేయడని గమనించాలి.

ఇక కొందరు మహానుభావులు తమ ఆత్మకథలు (ఆటోబ్రయోగ్రఫీ) రాసుకుంటారు. కొందరి డైరీలు ఏకంగా పుస్తకరూపంలో అచ్చువేస్తారు (గురజాడడైరీలు). కొందరు ప్రసిద్ధులు తమ మిత్రులకు రాసిన లేఖలను అచ్చువేస్తారు(చలంలేఖలు). ఇవన్నీ మంచివే. వీటిల్లో వారి వ్యక్తిత్వం, ప్రతిభ తెలుస్తుంది. తరువాతి తరం వాటిని మననం చేసుకోవడంవల్ల లాభముంది. అయితే వీటిలోని వస్తుప్రాధాన్యతనుబట్టి అవి నేటితరానికి ఉపయోగపడతాయి. ఆత్మకథల్లోని అనుభవం సమాజానికి చాలా అవసరం. 'విప్లవపథంలో నా పయనం'లో కామ్రేడ్ సుందరయ్యగారు ఎంతోమంది యువకులను ఉత్తేజపరిచారు. ఆత్మకథల్లో అతిశయోక్తులు చేర్చితే, ఇవి సమాజానికీ, జీవితానికీ సంబంధంలేని వైయక్తిక విషయాల 'గంప'గా మారితే దాన్ని ఎవరూ మోసి తలకెత్తుకోలేరు.

అనుభవం మొక్కకు కట్టిన అంటులాంటింది. బాగా ముదిరిన మామిడిచెట్టు కొమ్మకు లేత సియోనుకొమ్మను కడితే వచ్చే అంటుమొక్కలో అనుభవం ఇమిడివుంటుంది. ఇది స్వల్పకాలంలోనే పూతకూ, కాపుకూ వచ్చి మంచి ఫలాలనందిస్తుంది. మనమూ అంతే. మనకన్నా ముందువాళ్ల అనుభవాలనుండి ఎన్నో విషయాలను గ్రహిస్తే జీవితం పరిపూర్ణమవుతుంది.

ఈ సందర్భంగా శాస్త్రవేత్త న్యూటన్ మహాశయుడు 'నేను ఈ ఖగోళ అనంత విశ్వాంతరాళంలోకి చూస్తున్నానంటే నాకన్నా ముందున్న మహానుభాల భుజాలమీద నిలబడే తొంగి చూస్తున్నాను' అంటూ నిరాడంబరంగా చెప్పిన మాటలు గుర్తుచేసుకోవడం సముచితం.

ఎలా వుంది నా నవ్వు? టూత్‌పేస్ట్ యాడ్ కోసం గురూ!

నిజం

నిజం మరణించదు
కమ్యూనిజం మరణించదు

హు... ప్రజలు

దేవుడులేడన్నాడు బుద్ధుడు
విగ్రహారాధన మానండన్నాడు
నువ్వే దేవుడివని
బుద్ధుడి విగ్రహం పెడ్తున్నారు
హు... ప్రజలు

- జె.కె. భారతి

సెక్స్ చీరలు

(ఇద్దరు మహిళలు చీరలు కొనడానికి బట్టలషాపుకెళ్లారు)

"బాబూ! సెక్స్ శారీసుంటే ఇవ్వయ్యా..." అంది ఓ మహిళ.

"ఏంటమ్మా..." బిత్తర చూపులు చూస్తూ భయంభయంగా మళ్లీ అడిగాడు సేల్స్ బోయ్.

"సెవిటోళ్లందర్నీ సేల్స్ బోయ్స్‌గా పెట్టుకుంటే బేరాలేం సాగుతాయి? సెక్స్ శ్యారీస్ ఇవ్వయ్యా. త్వరగా వెళ్లిపోవాలి"

సేల్స్ బోయ్ రెండో మహిళ వైపు తిరిగి... "అమ్మా! ఆవిడ ఏం అడుగుతున్నారో మీకర్థమౌతోందా?" అన్నాడు మింగలేక, కక్కలేక.

"అయ్యా ఆవిడకు 'చ' పలకదు. అందుకే అలా అంది. నువ్వు చెక్స్ చీరలు చూపించయ్యా" అంది చిరుమందహాసం చేస్తూ రెండో మహిళ.

'ఓహో.... గళ్ల చీరలకొచ్చిన తిప్పలా ఇవి?!' అనుకుంటూ షాపులో వున్న చెక్స్ చీరలన్నీ వాళ్లముందు పరిచాడా పూర్ సేల్స్‌బోయ్.



ఆర్.ఎం.పీనా!

(రైల్లో మహిళా కంపార్ట్‌మెంట్లో...)

"అబ్బా...ఈ మొటిమ తెగ సతాయిస్తోంది. నొప్పి భరించలేకపోతున్నాననుకో. ఏదైనా చిట్కా చెప్పరాదు?!"

"మొటిమ మీద ఏదైనా యాంటీబయాటిక్ క్రీమ్ రాస్తేసరి"

"ఒద్దొద్దు. ఆ పనిమాత్రం చెయ్యొద్దు. నేను చెప్తున్నాకదా. జండూబామ్ పెట్టు. మొటిమ జాడే లేకుండా పోతుంది"

"ఏంటీ...మీరేమన్నా ఆర్.ఎం.పీ డాక్టరా?!"

"కాదు. ఎం.బి.బి.ఎస్"

మనసా... తెలుసా?



కౌన్సెలింగ్ సైకాలజిస్ట్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనర్, ఫోన్ : 9849130141

హిప్నో కమలాకర్

నేను ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాను. నా వయసు 17 సం॥లు. పదవ తరగతిలో 75 శాతం మార్కులతో పాసయ్యాను. అప్పట్లో ఏది చదివినా బాగా గుర్తుండేది. ఇంటర్‌లోకి వచ్చాక జ్ఞాపకశక్తి తగ్గింది. ఇంటర్‌లో మంచి మార్కులు రావాలంటే ఏంచెయ్యాలి.

ఆంజనేయులు, కడప.

పదో తరగతిలో సిలబస్‌కు, ఇంటర్ సిలబస్‌కు స్థాయి బేధం వుంటుంది. దానికి తగిన విధంగానే సమయం కేటాయించాలి. సబ్జెక్టును అవగాహన చేసుకోవడంలో మరింత నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి. ఇంటర్‌కు రాగానే మీ సామాజిక స్థాయితో బాటూ మానవ సంబంధాలూ విస్తృతమౌతాయి. దీని మూలంగా మీ మనసుపై వత్తిడి పెరిగే అవకాశం వుంటుంది. ఈ నేపథ్యంలో చదువుకు మీరిచ్చే ప్రాధాన్యత హెచ్చు తగ్గులకు లోనవుతుంది. ప్రస్తుతం మీరు పరిస్థితిని అవగాహన చేసుకోవడం ద్వారా సమస్యకు పరిష్కార మార్గం దొరుకుతుంది. మీరు చదువుకు ఇచ్చే ప్రాధాన్యతను బట్టి దాని పట్ల ఆసక్తి, ఏకాగ్రత, అర్థం చేసుకోగల్గడం, జ్ఞాపకం వుంచుకోవడం మొదలైన విషయాలు ఆధారపడి వుంటాయి. కాబట్టి మీరు ఎంత ఎదిగినా చదువు తర్వాతే అన్నీను అని గుర్తించండి.

నేను బి.ఎ. సెకండియర్ చదువుతున్నాను. నాకు సుపీరియారిటీ కాంప్లెక్స్, ఇన్ఫిరియారిటీ కాంప్లెక్స్, ఇగో ఈ మూడింటికి పూర్తి వివరణ కావాలి. అలాగే వీటికి పరిష్కార మార్గం తెలుసుకోవాలని ఆకాంక్ష. దయచేసి తెలుపగలరు.

పి. రజని, వరంగల్

సుపీరియారిటీ కాంప్లెక్స్ అంటే ఒక వ్యక్తి తన సామర్థ్యానికి మించిన శక్తి తనకు కలదని భావించడం. ఇన్ఫిరియారిటీ కాంప్లెక్స్ అంటే ఇందుకు పూర్తి భిన్నంగా వ్యవహరించడం. పని చేయగల సామర్థ్యం తనకున్నప్ప టికీ అది లేదేమోనని న్యూనత భావాలను కల్గి వుండడం, ఇక ఇగో విషయానికి వస్తే ప్రముఖ సైకాలజిస్టు సిగ్మండ్ ఫ్రాయడ్ నిర్వచించినట్టు, ఇది మూర్తిమత్వంలో ఒక భాగం. ఇది ఇడ్‌కు సూపర్ ఇగోకు నడుమ మధ్యవర్తిగా వ్యవహరిస్తుంది. అంతరంగంలో ఒత్తిడిని కలుగ చేసే మనోభావాలు ఇడ్‌లోకి నెట్టి అది జ్ఞప్తికి రాకుండా చూస్తుంది. అయితే వాడుక భాషలో గర్వం కలిగిన వ్యక్తిని ఉద్దేశ్యించి మాట్లాడేటప్పుడు ఇగో పదాన్ని ఉపయోగిస్తాం. ఇవి ఏవీ మీరు భావిస్తున్నట్టుగా మానసిక రుగ్మతలు కావు. ఇవి కేవలం మానసిక స్వభావాలు మాత్రమే. ఈ స్వభావాలు మనుగడకు ఇబ్బంది కల్గించేవే. ఇవి ప్రణాళికాబద్ధతను దెబ్బతీస్తాయి. విజయానికి అవరోధంగా నిలుస్తాయి. అందుకే వాస్తవిక దృక్పథాన్ని కలిగి వుండాలి. సహజత్వానికి దగ్గరగా వుండడం ద్వారా ఈ సమస్యల నధిగమించ వచ్చు. ఒకవేళ ఎవరికివారే స్వయంగా వీటిని నివారించే క్రమంలో సత్ఫలితాలను సాధించలేక పోతుంటే అందుబాటులో వున్న సైకలాజికల్ కౌన్సిలర్‌ను సంప్రదించవచ్చు.

నేను ఇంటర్ బైపీసీ చదివాను. పాస్ కాలేదు. ఫస్టియర్ బోటనీ, సెకండియర్ జువాలజీ, ఫిజిక్స్ వుండిపోయాయి.నాకు ఫిజిక్స్ అంటే చాలా భయం. పుస్తకం తీయగానే ఏమీ అర్థం కాదు. మనసు ఎటో పోతుంది. ఏ కాస్తో చదివినా గుర్తుండదు. ఈ భయం పోవాలంటే ఏం చెయ్యాలి ?

మనోహర్, విజయవాడ

నువ్వు చదువుకునే క్రమంలో ఆ సబ్జెక్ట్ ప్రారంభ దశలో టీచర్లు బోధించే విధానం సరిగ్గా లేకపోవడం మూలంగానో, ఆయా టీచర్లతో ఆయా సబ్జెక్ట్‌లతో మీకు సరయిన అనుసంధానం ఏర్పడకపోవడం మూలంగానో ఈ సమస్య తలెత్తుతుంది. అయితే పరిణామక్రమంలో వాటినన్నిటినీ అధిగమించగల్గితే ప్రస్తుతం ఆ సబ్జెక్ట్‌లు నీకు ఇంత కష్టంగా వుండేవి కావు. మన శరీరంలో ఎన్నో భాగాలున్నాయి. అయితే ఏ భాగాన్ని మనం నిర్లక్ష్యం చేయలేం. క్లాసు సబ్జెక్టులూ ఇంతే. నువు ఇష్ట పడిన వాటినే చదివితే సబ్జెక్ట్‌లు ఇలాగే మిగిలిపోతాయి.

ఇష్టమైన సబ్జెక్ట్‌లను మాత్రమే చదవడం కాకుండా అవసరమైన సబ్జెక్ట్‌లనూ ఇష్టపడి చదవాలి. క్రమంగా ఆ సబ్జెక్టుల పట్ల వ్యతిరేకత పోతుంది. మన శరీర భాగాలన్నిటికి మనం సమాన ప్రాతినిధ్యం ఇచ్చినట్టే అన్ని సబ్జెక్ట్‌లపైనా ఏకాగ్రత అమరి సమన్వయం ఏర్పడుతుంది.

సమస్యలకు ఆహ్వానం

మీకు లేదా మీవాళ్ళకు మానసికమైన సమస్యలేమైనా తలెత్తాయా? ఏం చేయాలో పాలుపోక సతమతమవుతున్నారా? అయితే వెంటనే ఆ సమస్యేంటో మాకు తెలియజేయండి. సైకాలజిస్ట్ **శ్రీ హిప్నోకమలాకర్** తగిన పరిష్కారాన్ని తెలియజేస్తారు.

మా చిరునామా: ప్రజాశక్తి ఆదివారం అనుబంధం, ప్లేట్ నెంబర్: 1, అశోక్ నగర్, హైదరాబాద్ - 500 020.

విజ్ఞాన వీచిక

ఎస్. వెంకట్రావు

అంతరిక్ష కేంద్రం అనుకున్నట్టు పూర్తయ్యేనా?!



గత నెల 27న ప్రయోగించాల్సిన అమెరికా అంతరిక్ష షటిల్ నౌక అట్లాంటిస్ ప్రయోగం మరోమారు వాయిదా పడడంతో అంతరిక్షంలో నిర్మితమవుతున్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్ర (ఐఎస్ఎస్) నిర్మాణం అనుకున్న ప్రకారం పూర్తవుతుందా అన్న అనుమానాలు బలపడుతున్నాయి. 1998లో పని ప్రారంభించబడిన అంతరిక్ష కేంద్ర నిర్మాణం అనుకున్న ప్రకారం అయితే గత ఏడాది చివరికే పూర్తికావాలి. కాని 2003లో అమెరికా అంతరిక్ష షటిల్ నౌక కొలంబియా ప్రమాదానికి గురికావడంతో రెండున్నరేళ్లపాటు అమెరికా ఆ కేంద్రానికి రాకపోకలు ఆపేసింది. దాంతో అంతరిక్ష కేంద్రంలో శాశ్వతంగా నివాసముంటున్న వ్యోమగాములకు కావలసిన సరఫరాలను సోవియట్ వాహనం సోయుజ్ ద్వారా అందించాల్సి వచ్చింది. మొత్తంమీద అంతరిక్ష కేంద్ర నిర్మాణం మాత్రం వెనుకపట్టు పట్టింది. గత నెల 27న అట్లాంటిస్ ప్రయోగంతో అంతరిక్ష కేంద్ర నిర్మాణాన్ని మరోమారు గాడినెక్కించాలనుకున్నారు. కాని ఎర్నెస్టో పేరుతో ముంచుకొచ్చిన తుపాను షటిల్ ప్రయోగాన్ని మరోమారు వాయిదాపడేట్లు చేసింది. షటిల్ ప్రయోగ సమయంలోనే ఎర్నెస్టో విరుచుకుపడడంతో ఫ్లోరిడాలోని కెన్నడీ అంతరిక్ష ప్రయోగశాలలో గల ప్రయోగ వేదికమీదనుండి షటిల్‌ను వెనక్కి నిర్మాణ వేదికమీదికి తీసుకురావడం ప్రారంభించారు. తీరా షటిల్ సగం దూరం వెనక్కి వచ్చేసరికి తుపాను కాస్తా బలహీనపడింది. మళ్లీ దాన్ని ప్రయోగ వేదికమీదకు తరలిస్తున్నారు. వాతావరణం బాగుంటే ఈ వారంలోనే అట్లాంటిస్‌ను ప్రయోగిస్తారు. ఒకవేళ సెప్టెంబర్ 7వ తేదీ లోగా ప్రయోగించకపోతే ఇక దాని తేదీలు నిరవధికంగా వాయిదా వేయాల్సివస్తుంది. ఎందుకంటే సెప్టెంబర్ 13వ తేదీన రష్యా అంతరిక్ష వాహనం సోయుజ్ సరఫరాలతో సహా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)కు బయలుదేరుతుంది. అప్పటికల్లా అట్లాంటిస్ నౌక అంతరిక్ష కేంద్రాన్ని విడిచిపెట్టి భూమికి వచ్చేయాలంటే అది 7వ తేదీలోగా ప్రయోగించబడాలి, లేకుంటే వాయిదా వేసుకోవాలి.

అట్లాంటిస్ నౌక ఆరుగురు వ్యోమగాములతో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లనుంది. వారిలో మహిళా వ్యోమగామి మిషన్ స్పెషలిస్టు హీడ్‌మేరీ స్టీఫానిషిన్ ఒకరు. 2000వ సంవత్సరం నుండి అంతరిక్ష కేంద్రంలో కనీసం ఇద్దరు వ్యోమగాములు ఉంటూ వస్తున్నారు. వీరిలో ప్రధానంగా అమెరికా, రష్యాలకు చెందిన వ్యోమగాములే ఉన్నారు. కొలంబియా ప్రమాదానికి ముందు ఈ కేంద్రంలో ముగ్గురేసి వ్యోమగాములు నివసించేవారు. కాని భారత సంతతికి చెందిన మహిళా వ్యోమగామి కల్పనాచావ్లాతో సహా ఏడుగురు వ్యోమగాముల మృతికి కారణమైన కొలంబియా దుర్ఘటన తరువాత అంతరిక్ష కేంద్రానికి రాకపోకలు తగ్గాయి. దాంతో వ్యోమగాములు వాడేసిన వ్యర్థాలు పేరుకుపోవడంతో వ్యోమగాముల సంఖ్యను మూడు నుండి రెండుకు తగ్గించారు. ఈ తగ్గింపువల్ల అంతరిక్ష ప్రయోగాలకు బాగా అంతరాయం కలిగిందని నాసా శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

అట్లాంటిస్ ప్రయోగం కనీసం ఈ వారం జరిగితే ఇప్పటికే సగం పూర్తయి ఉన్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి మరికొన్ని ముఖ్యమైన భాగాలను అమర్చడానికి వీలవుతుంది. దీంతోబాటు రానున్నకాలంలో అంతరిక్ష కేంద్రానికి మరిన్ని షటిల్స్ వెళ్లి అక్కడి సరఫరాలు పెంచగలుగుతాయి. 2008 నాటికి అక్కడ ఆరుగురికి సరిపడా గదుల (మాడ్యూల్స్) నిర్మాణం పూర్తిచేసి పూర్తిస్థాయిలో ఆరుగురు వ్యోమగాములను పంపనున్నట్లు నాసా వెల్లడించింది. ఈ వారంలో ప్రయోగించబోయే అట్లాంటిస్ నౌకలో ఆహారం, శాస్త్ర సంబంధమైన పరికరాలతోబాటు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి అవసరమైన రెండు సౌర రెక్కలను, రెండు పెద్ద ట్రస్సులను పంపుతున్నారు. సౌర రెక్కలు ఇంధనం ఉత్పత్తి చేయడానికి ఉపయోగపడతాయి. భారీ ట్రస్సులు అంతరిక్ష కేంద్రానికి అమర్చడంవల్ల అది అంతరిక్ష వాహనాలకు పోర్టులాగా ఉపయోగ పడుతుంది. 2003 కొలంబియా ప్రమాదం తర్వాత అమెరికా ఇంతవరకు అంతరిక్షంలోని వ్యోమగాములకు అత్యవసర వస్తువులైతే పంపింది గాని నిర్మాణానికి సంబంధించిన చర్యలేమీ చేపట్టలేదు. రెండు సంవత్సరాల తరువాత ఐఎస్ఎస్ నిర్మాణానికి పనిముట్లతో సహా అట్లాంటిస్ వెళుతుంటే ఇప్పుడీ అవాంతరమేమిటని చాలామంది బాధపడుతున్నారు. ఏదేమైనా ప్రయోగం జయప్రదమైతే అంతర్జాతీయ అంతరిక్ష కేంద్ర నిర్మాణం వేగవంతమవుతుంది. ఒక్క అమెరికానే తన వంతుగా 10,000 కోట్ల డాలర్లు వ్యయం చేస్తున్న ఈ అంతరిక్ష కేంద్ర నిర్మాణం ఇప్పటి లెక్కప్రకారమైతే 2010 నాటికి పూర్తవుతుందని అంచనా. రానున్నకాలంలో ఇంకేవైనా ఆటంకాలు వస్తే గడువు ఇంకా పెరగవచ్చు. ఇప్పటివరకు రష్యా రెండు, అమెరికా రెండు మాడ్యూల్స్ (గదులు) పంపి సగం నిర్మాణం పూర్తిచేశాయి. మరో ఆరు గదులూ, ట్రస్సులూ, పోర్టులూ కడితేనేగాని నిర్మాణం పూర్తికాదు.

సగం పూర్తయిన దశలోనే అంతరిక్ష కేంద్రం అనేకవిధాల ఉపయోగపడుతోంది. ఇప్పటివరకు అనేక డజన్ల వ్యోమగామి బృందాలు అంతరిక్ష కేంద్రానికి వెళ్లి ఎన్నో ప్రయోగాలు చేసి వచ్చాయి. అనేకమంది అంతరిక్షంలో నడిచి వెళ్లి రిపేర్లు చేశారు. అమెరికా, రష్యా, జపాన్, కెనడా, యూరప్‌లతో సహా మొత్తం 15 దేశాలు, అయిదు అంతరిక్ష కేంద్రాల సహకారంతో నిర్మించబడుతున్న ఈ కేంద్రం రానున్నకాలంలో పెద్ద టూరిస్టు ఆకర్షణగా మారబోతోంది. ఇప్పటికే ముగ్గురు టూరిస్టులు ఇక్కడికి వెళ్లి వచ్చారు. అంతరిక్ష కేంద్ర నిర్మాణం పూర్తికాకముందే అంతరిక్ష టూరిజం పెరిగిపోతోంది. 2 కోట్ల అమెరికన్ డాలర్లిస్తే ఎవరైనా అంతరిక్ష కేంద్రానికి వెళ్లి రావచ్చని రష్యన్ అంతరిక్ష సంస్థ ప్రకటించడంతో 2001లో డెన్నిస్ టిటో అనే కోటీశ్వరుడు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని అంతరిక్ష టూర్ వెళ్లి వచ్చాడు. ప్రపంచంలోని మొట్టమొదటి స్పేస్ టూరిస్టుగా ఆయన నిలిచిపోయాడు. తరువాత మరో ఇద్దరు వ్యక్తులు అంతరిక్ష విహారం చేసి వచ్చారు. వారు కూడా ట్రిప్పుకు 2 కోట్ల డాలర్లు (సుమారు 90కోట్ల రూపాయలు) చెల్లించారు. వారిలో ఒకడు మార్క్ షటిల్‌వర్త్. ఈయన 2002 ఏప్రిల్ 25 సోయుజ్ వాహనంలో ఐఎస్ఎస్‌కు వెళ్లి కొద్ది రోజులు ఉండి వచ్చాడు. తరువాత 2005 అక్టోబర్ 1న గ్రెగొరీ ఓల్సన్ అనే వ్యక్తి కూడా సోయుజ్‌లోనే ఐఎస్ఎస్ సందర్శించి వచ్చాడు. మొట్టమొదటిసారిగా టిటో కూడా సోయుజ్ నౌకలోనే ఐఎస్ఎస్‌కు వెళ్లి వచ్చాడు. ఈ అంతరిక్ష కేంద్రంలో ఇంకో విశేషం కూడా జరిగింది. రష్యన్ వ్యోమగామి యూరి మలెంచెంకో అంతరిక్ష కేంద్రంలోనుండే టెక్సాస్‌లో ఉంటున్న తన ప్రియురాలు ఎకటెరినా డిమిట్రీవ్‌ను తోటి వ్యోమగాముల సమక్షంలో వివాహం చేసుకున్నాడు.

మీలో కూడా ఎవరైనా అంతరిక్ష విహార యాత్ర చేయాలనుకుంటే ముందుముందు చేయవచ్చు. కాకపోతే రెండే షరతులు– ఒకటి, ఆరోగ్యం సరిగా ఉండాలి. రెండు, తొంభై కోట్లు (తొడుక్కునేవి కావు... రూపాయలు) రుసుం చెల్లించాలి. ✦



కొత్త పుస్తకాలు

భారత్...దట్ వజ్ ఇండియా

దేశం మారాలని, ప్రపంచదేశాల్లో భారత్ అగ్రగామిగా ఎదగాలనీ ప్రతి వ్యక్తీ భావిస్తాడు. దానికి సంబంధించిన 'ప్రణాళిక మీ వద్ద సిద్ధంగా వుందా?' అని ప్రశ్నిస్తే అందరూ 'ఔను' అని సమాధానం చెప్పలేరు. నేలంటి మధు 'భారత్... దట్ వజ్ ఇండియా'లో తన వైజ్ఞానిక ప్రాజెక్టును మన కళ్లముందుంచే ప్రయత్నం చేశారు. వైజ్ఞానిక, సామాజిక, ఆర్థిక రంగాల్లో రాబోయేతరం అద్భుత విజయాలను సాధించి కచ్చితంగా భారత్‌ను అగ్రగామిదేశంగా తయారుచేస్తుందని రచయిత విశ్వశిస్తారు.

అమెరికా తన అగ్రరాజ్య హోదాను, ధనికదేశాలు వాటి ప్రభావాన్ని కోల్పోతే భారత్, ఆసియాలోని మరికొన్ని పేదదేశాల జీవనశైలిలో మార్పు వస్తుంది. ఈ మార్పును ధనాత్మక కోణంలో వివరిస్తూ, మానవతా విలువల స్పృతో ఈ నవల ఆవిష్కృతమవుతుంది. సమాజంలో ఏయే మార్పులు రావాలని ఆశిస్తున్నామో ఆ మార్పులన్నీ సాధ్యమైనప్పుడు, మరో ప్రపంచంలోని వ్యక్తుల ఉన్నతమైన జీవన లక్ష్యాలు మనల్ని మంత్రముగ్ధుల్ని చేస్తాయి. భారతీయ సంస్కృతీ సంప్రదాయాల్లో వుండే విలువలను రచయిత విశ్లేషించిన తీరు మనల్ని కట్టిపడేస్తుంది. సైన్స్ ఫిక్షన్‌తో ఆద్యంతం ఆసక్తిగా చదివించే శైలితో మనసును ఆకట్టుకునే అద్భుత రచన ఇది.

నవలలో కన్పించే కొన్ని విషయాలు విస్మయం కల్గిస్తాయి. అవి విటమిన్ సిగరెట్లు తాగటం, భూప్రదక్షణకు, విహారయాత్రకు వెళ్ళే పర్యాటకులు, అన్ని గ్రహాలకు చేరడమేగాక విశ్వం అంచులదాకా ప్రయాణించగలిగే వైజ్ఞానిక ప్రగతి, సూర్యుని వద్దకు సైతం రోదసీయానం చేసే సాహసం, చంద్రునిపై ప్లాట్లు, ఆధునిక రక్షణ గృహాలు, అత్యాధునిక పోలీసు వ్యవస్థ, కోర్టులు, సొరంగమార్గంలో భారత్‌పాక్ యుద్ధం, మాఫియా, యూరప్‌లో డ్రగ్స్ బలహీనత, యువతలో వంటరితనం, ఇండియా, ఇతర ఆసియాదేశాలపై అమెరికా ఆధారపడటం, వాటి సహాయాన్ని అభ్యర్థించడం, నోబెల్‌ఫండ్‌తో గాంధీసేవాశ్రమాలు నడపడం, పలురంగాల్లో ప్రతి సంవత్సరమూ భారత్ నోబెల్ బహుమతులను కైవసం చేసుకోవడం ఇత్యాది అంశాలు ఈ నవల్లో కన్పిస్తాయి.

భారత్...దట్ వజ్ ఇండియా
నేలంటి మధు
వెల : 25/-, పేజీలు188
ప్రతులకు :
నెమలివేలి పబ్లికేషన్స్, ఇం.నెం. 2-1-390/ఎఫ్./1హెచ్, శివానందనగర్, ఫీవర్ హాస్పిటల్ ఎదట, తిలకనగర్ రోడ్, నల్లకుంట, హైదరాబాద్. ఫోన్ : 27671020.

కవితాత్మకంగా వున్న వచన శైలి బావుంది. ఈ నవలలో రచయిత పలు సందర్భాల్లో చేసిన ప్రకృతి వర్ణనల్లో లోతైన పరిశీలన వుంది. ప్రతి అంశాన్నీ వర్ణించిన తీరు బావుంది. సమాజంలో వున్న దుర్నీతిపై రచయిత కసి తీవ్రమైనది. రచయిత కేవలం తన దృక్కోణాన్ని గాక పలువురితో చర్చించి, విశ్లేషించి, నిగ్గుతేల్చిన నిగూఢ సత్యాలకు అక్షరరూపమిచ్చారు. పుస్తకం చదవడం ముగిసాక, అందులోని పలు అంశాలు మనల్ని వెంబడిస్తాయి, ఆలోచింపచేస్తాయి. అంటే రచయిత విజయం సాధించినట్లే.

ఈ నవల కాల్పనిక సాహిత్య పరిధిలోకి వస్తుంది. సాహిత్య లక్ష్యాలైన సత్యం, మానవీయత, సంక్షేమం, ప్రజాభ్యుదయం, దార్శనికత ఇత్యాది అంశాలు ఈ నవల ప్రతి పుటలోనూ దర్శనమిస్తాయి, సైన్స్, ఫిక్షన్‌తో కూడిన ఈ రచన గొప్ప సాహిత్య పరిమళాల్ని గుభాళిస్తుంది.

ఇందులోని వైజ్ఞానిక అంశాలు ఆచరణసాధ్యమా అన్పించవచ్చు. అయితే ఈ ప్రయోగాల్లోని లక్ష్యాన్ని, రచయిత ఉద్దేశాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవలసి వుంటుంది. వైజ్ఞానిక ప్రగతి నిత్యజీవనంలో భాగమైపోయే అవకాశాల్ని వీలైనంతగా రచయిత ప్రతి సందర్భాన్నీ ఉపయోగించుకున్నారు. సాహితీ పాఠకులు కరువౌతున్న నేపథ్యంలో రొటీన్‌కు భిన్నంగా ప్రేమ, కుటుంబం, డబ్బు చుట్టూ తిరిగే రచన కాకుండా వినూత్నమైన అంశాన్ని ఎంచుకోవడాన ఇది విజవంతమైంది. మరి ఆలస్యమెందుకు, నవలను అందుకోండి. కొత్త వైజ్ఞానిక ప్రపంచపు ద్వారాలు తెరచి ఆహ్వానిస్తున్నాడు రచయిత.

- తంగెళ్ళపల్లి కనకాచారి

స్వీకారం

జమారా కవితాధార
నమిలికొండ జగన్ మాధవరావు
వెల: 80/-, పేజీలు: 108
ప్రతులకు :
నమిలికొండ జగన్‌మాధవరావు
ఇం.నెం. 1-138, శివాజీనగర్
బోయినిపల్లి (మండలం)
కరీంనగర్ జిల్లా- 505 524 (ఆం.ప్ర)
ఫోన్ 08723 - 254306

అమ్మను జూడాలె
ఉదయమిత్ర కథలు
వెల: 40/-,
పేజీలు: 101
ప్రతులకు :
నవోదయ బుక్ హౌస్
ఆర్యసమాజం ఎదురు లేన్
కాచిగూడ చౌరస్తా, హైదరాబాద్ - 27



కావలసిన పదార్థాలు

వైట్ బీన్స్	-	150 గ్రాములు
బస్మతి బియ్యం	-	2 కప్పులు
టమేటో జ్యూస్	-	3 కప్పులు
దాల్చిన చెక్క	-	చిన్న ముక్క
లవంగాలు	-	రెండు
వెల్లుల్లి	-	రెండు రేకులు
ఏలకులు	-	రెండు
నెయ్యి లేదా		
[illegible] ఆయిల్	-	3 టేబుల్ స్పూన్లు
ఉప్పు	-	తగినంత
కొత్తిమీర	-	ఒక కట్ట

తయారుచేసే పద్ధతి

రాత్రిపూట వైట్ బీన్స్ నీటిలో నానబెట్టి ఉదయమే నీళ్లు వంపేసి గింజలు ఒక గిన్నెలో వుంచండి. బాస్మతి బియ్యాన్ని కూడా 15 నిమిషాలు నానబెట్టి, ఆ నీళ్లన్నీ వంపేయాలి. మందపాటి గిన్నెలో నెయ్యి వేసి అందులో పైన చెప్పిన దినుసులన్నీ వేయించాలి. తరువాత బాస్మతి బియ్యం పోసి రెండు మూడు నిమిషాలు కలపండి. ఇప్పుడు వైట్ బీన్స్ కూడా వేయించాలి. ముందుగా సిద్ధం చేసుకొన్న పచ్చి టమేటో రసాన్ని, బియ్యం, వైట్ బీన్స్ మిశ్రమంలో పోసి కలియబెట్టండి. కొద్దిగా ఉప్పు వేసి సన్న సెగ మీద ఉడకనిచ్చి కొత్తిమీర చల్లండి. వేడివేడి టమేటో వైట్‌బీన్స్ పులావ్ రెడీ...! వర్షాకాలంలో పిల్లలు స్కూల్ నుండి రాగానే ఈ పులావ్ వడ్డించి చూడండి.. ఎంత రుచిగా వుందో... ఐతే ఈ పులావ్‌తో పాటు ఏదైనా చెట్నీ లేదా అప్పడాలు వేయించి పెడితే యింకా రుచిగా వుంటుంది.

టమేటో... వైట్‌బీన్స్ పులావ్

రుచి

కావలసిన పదార్థాలు

శనగపిండి	-	ఒక కప్పు
బియ్యంపిండి	-	ఒక కప్పు
ఉడికించిన బంగాళాదుంప ముక్కలు	-	రెండు కప్పులు
ఉల్లి తరుగు	-	అరకప్పు
పచ్చిమిర్చి తరుగు	-	అరకప్పు
అల్లం వెల్లుల్లి పేస్ట్	-	ఒక స్పూన్
నిమ్మరసం	-	ఒక స్పూన్
ఉప్పు	-	తగినంత
నూనె	-	సరిపడా
కారం	-	ఒక స్పూన్

తయారుచేసే పద్ధతి

ఓ బేసిన్‌లో బియ్యప్పిండి, శనగపిండి తీసుకొని ఉప్పు,కారం వేసి నీరుపోసి బజ్జీల పిండిలా కలిపి పక్కన పెట్టుకోవాలి. మరో గిన్నెలో ఉడికించిన బంగాళాదుంప ముక్కలను తీసుకుని, చిదిమి దీనిలో ఉల్లి తరుగు, కొత్తిమీర, పచ్చిమిర్చి, ఉప్పు, నిమ్మరసం, అల్లంవెల్లుల్లి పేస్ట్ వేసి బాగా కలిపి, నిమ్మకాయంత ఉండలు చేసుకొని, కలిపి వుంచుకున్న పిండిలో ముంచి నూనెలో వేసి ఎర్రగా వేయించి తీయాలి.

- జ్యోతి

ఆలూ బోండా



చూటీ

ఆ బడి అడవిలో వుంది. అక్కడ చదువుకోడానికి బోలెడన్ని జంతువులు, పక్షులు వస్తాయి. వీటికి పాఠాలు చెప్పేదేమో గుడ్లగూబ టీచర్‌గారు. ఆమె చాలా చక్కగా చెప్తారు. విద్యార్థులను ప్రేమగా చూస్తారు. ఇంకానేమో... పాఠశాల చుట్టూ పండ్లు, పూల చెట్లున్నాయి. అంతేకాదు స్కూల్లో పెద్ద ఆటస్థలం ఉంది. అందులో రకరకాల ఆట వస్తువులున్నాయి.

అందుకే ఆ స్కూల్లో చదువుకోవడమంటే తాబేలు పిల్లకు చాలా ఇష్టం. అది ఎప్పటిలాగే ఎంచక్కా పుస్తకాల సంచి తగిలించుకుని బడికి బయలుదేరింది. దారిలో మిత్రబృందం కనిపించింది. నిజానికి అవన్నీ స్కూలుకనే బయలుదేరాయి. కానీ మార్గమధ్యలో నిర్ణయం మార్చుకున్నాయి. అక్కడే చెట్ల కింద ఆడుకోసాగాయి. అనుమానం వచ్చిన తాబేలు "ఏంటి స్కూలుకి రావడంలేదా?" అనడిగింది.

"నేను స్కూలుకి రావడంలేదోచ్. నాకు బడంటే ఇష్టం లేదోచ్' హుషారుగా ప్రకటించింది ఉడుత.

"ఇవాళ నాకు బడికి రావాలని లేదు" చెప్పింది కుందేలు బద్ధకంగా.

"నేను స్కూలుకెళ్లడంలేదు. ఎందుకంటే నేను స్కూల్లో కుదురుగా ఒక్క నిముషం కూడా కూర్చోలేను" కోతి గారాలుపోతూ అంది.

"మేంకూడా అంతే" అన్నాయి కప్ప, నత్త.

"మొన్నెప్పుడో ఇక్కడో పురుగును చూశాను. దాన్ని ఇవాళ పట్టుకోవాలి. అందుకే స్కూలుకురాను" అంది పిచ్చుక పట్టుదలగా.

మీరు రాకపోతే నాకెందుకన్నట్లు "స...రే...లే...! నేను మాత్రం స్కూలుకెళ్తున్నాను. బై" అంటూ తాబేలు మెల్లగా నడుచుకుంటూ వెళ్లిపోయింది.

* * *

ఆ రోజు బడికి విద్యార్థులెవరూ రాలేదు. కారణం తెలీని గుడ్లగూబ టీచర్‌గారు అటూ ఇటూ తిరుగుతూ వారి కోసం ఎదురుచూస్తున్నారు. ఈలోగా "గుడ్ మార్నింగ్ మేడమ్" అంటూ తాబేలు మెల్లగా లోపలికి వచ్చింది. గుడ్లగూబ సంతోషంగా 'వెరీ గుడ్ మార్నింగ్" అంటూనే ఆతురతగా "మిగతా వాళ్లేరి?" ప్రశ్నించారు. "బహుశా వాళ్లు దారిలో వున్నారేమో టీచర్" బ్యాగ్ నేల మీద పెడుతూ చెప్పింది తాబేలు.

"అయితే ఇవాళ నీకు పాఠాల్లోలేని విషయాలు ఏవైనా చెప్తాను. ఆకాశం నీలంగా ఎందుకుంటుంది? జంతువులన్నీ కలిసే వుంటున్నా వాటి ఆహారపుటలవాట్లు వేరువేరుగా ఎందుకుంటాయి? లాంటి విషయాలు చెప్పుకుందామే...' అన్నారు స్నేహపూర్వకంగా చూస్తూ గుడ్లగూబ టీచర్. అలా సాయంత్రం వరకు ఇద్దరూ ఎన్నో విషయాలు చెప్పుకున్నారు.

* * *

ఇక్కడ స్కూలు ఎగ్గొట్టిన తాబేలు స్నేహితులంతా... హుషారుగా ఆడుకున్నాయి. పాడుకున్నాయి. సాయంత్రం వరకు అవి తెచ్చుకున్న టిఫిన్ బాక్సుల సంగతే మర్చిపోయాయి. తర్వాత అన్నీ ఒక పెద్ద చెట్టు కింద కూర్చుని బాక్సులు తెరిచాయి.

కుందేలు తన బాక్సులో వున్న లేత, తాజా క్యారెట్లు, క్యాబేజీ తినడంలో మునిగిపోయింది. ఉడుత బఠాణీ గింజలు కొరుక్కు తినడంలో బిజీ అయ్యింది. కోతి అరటిపళ్లను, నత్త మెత్తటి లేలేత ఆకులను తినసాగాయి. పిచ్చుక మాత్రం తను ఎప్పుడో చూసిన పురుగును ఎట్టకేలకు పట్టుకుని తినేసింది. తర్వాత జోక్స్ వేసుకుని నవ్వుకోసాగాయి. స్కూలు నుంచి తిరిగి వస్తున్న తాబేలును చూశాకగానీ తామూ ఇంటికి వెళ్లాలన్న విషయమే గుర్తురాలేదు వాటికి.

* * *

ఇంటికెళుతున్న తాబేలును చూడడంతోటే "ఏం తాబేలుగారూ... ఇవాళేంటి మీ తలసైజు పెద్దగా అయ్యింది. ఓ... మీరు ఒక్కరే స్కూలుకెళ్లారు కదూ. అందుకే టీచర్ చెప్పినవన్నీ వినేసరికి అలా అయివుంటుంది"

"మీ తెలివి బాగా పెరిగి వుంటుందే..."

"ఓ... మేధావి తాబేలుగారా...రండి రండి"

"ఔనూ... ఇవాళ మీరు నేర్చుకున్నదాంట్లోంచి మమ్మల్ని ఒక్క ప్రశ్న వెయ్యండి. మేం సమాధానం చెప్పగలమేమో చూద్దాం" వెటకారంగా తలోమాట అన్నాయి. అందుకు తాబేలు అస్సలు బాధపడలేదు. పైగా దానికి సంతోషంగా వుంది. మరి తనకు స్కూలుకెళ్లడంవల్ల బోలెడన్ని విషయాలు తెలిశాయి కదా. అందుకన్నమాట. "సరే... చెప్పండి. ముందు మెరుపు వస్తుందా? ఉరుము వస్తుందా?" అనడిగింది తాబేలు.

(బడి ఎగ్గొట్టి ఆటపాటలతో గడిపిన జంతువులు, పక్షులు ఆ ప్రశ్నకు సరైన సమాధానం చెప్పగలిగాయా లేదా? ఒకవేళ చెప్పలేకపోతే బడి ఎగ్గొట్టినందుకు పశ్చాత్తాపం చెందాయా? చివరికి వాటిలో ఎలాంటి మార్పు వచ్చింది? అన్న విషయాలు తెలియాలంటే... మీరంతా వారం రోజులు ఆ..గా..ల్సిం...దే!)